పునర్ముద్రిత లఘు గ్రంథాలు

యక్షగానము

డా॥ ఎస్.వి.జోగారావు

ప్రపంచ తెలుగు మహాసభలు

27-29 డిసెంబర్, 2012, తిరుపతి

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
రాష్ట్ర సాంస్కృతిక శాఖ, సాంస్కృతిక మండలి

పొట్టి శ్రీరాములు
తెలుగు విశ్వవిద్యాలయం

Blank Page

పునర్ముద్రిత లఘు గ్రంథాలు

యక్షగానము

డా॥ ఎస్. వి. జోగారావు

ప్రపంచ తెలుగు మహాసభలు

27-29 డిసెంబర్, 2012, తిరుపతి

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం

మండలి వెంకటకృష్ణారావు అంతర్జాతీయ తెలుగుకేంద్రం

పబ్లిక్ గార్డెన్స్, హైదరాబాదు - 500 001.

Yakshagaanamu
– Dr. S.V.Joga Rao

యక్షగానము

రచయిత : డా॥ ఎస్.వి. జోగారావు

ISBN : **81-86073-328-1**

ప్రచురణ నెం : **465**

ప్రతులు : **5000**

ప్రథమ ముద్రణ : ఏప్రిల్, **1975**

ద్వితీయ ముద్రణ : డిసెంబర్, **2012**

వెల : రూ. **20/-**

ప్రతులకు : **సంచాలకులు**
ప్రచురణల విభాగం,
పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
లలితకళాక్షేత్రం, పబ్లిక్ గార్డెన్స్,
హైదరాబాదు - 500 004.

ముద్రణ : **సాయిలిఖిత ప్రింటర్స్**, ఖైరతాబాద్, హైదరాబాద్.

యన్. కిరణ్ కుమార్ రెడ్డి

ముఖ్యమంత్రి
ఆంధ్రప్రదేశ్

హైదరాబాదు




నాంది

ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారిని ఒక్క వేదిక పైకి తీసుకు వచ్చేందుకు, తెలుగు ప్రభలను దశదిశలా వ్యాపింపజేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం 2012 డిసెంబర్ 27 నుండి 29 వరకు ఏడుకొండలవాడి ఆవాసమైన తిరుపతి పుణ్య క్షేత్రంలో అత్యున్నత స్థాయిలో తెలుగు మహాసభలను ఏర్పాటు చేసింది. రాష్ట్రంలోనూ, దేశంలోనూ, ఇతర దేశాల్లోనూ ఉన్న తెలుగు వారందరూ పరస్పరం భావ వినిమయం చేసుకోవడానికీ, తెలుగువారు తమ గత చరిత్రను సంస్మరించుకుంటూ, ఉత్కృష్టమైన భవిష్యత్తును నిర్మించుకోవడానికో ఈ మహా సభలు ఎంతగానో దోహదం చేస్తాయని మేము విశ్వసిస్తున్నాం.

తొలి ప్రపంచ తెలుగు మహాసభలు జరిగి 37 సంవత్సరాలు గడిచాయి. అయితే ఇంతవరకూ ఏ రాష్ట్ర ప్రభుత్వం ప్రపంచ మహాసభలను నిర్వహించడానికి చొరవ చూపలేదు. మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచీ ప్రజాజీవితాన్ని ఎలా మెరుగుపరచాలీ, తెలుగు వారి వైభవాన్ని ఎలా పరిరక్షించాలీ అనే దృష్టితో పనులు చేపడుతోంది. తెలుగువారి నిర్వహణ సామర్థ్యాన్ని ఇటీవల జరిగిన జీవ వైవిధ్య సదస్సులో కూడ ప్రభుత్వం నిరూపించింది. ఈ నేపథ్యంలోనే ప్రపంచ తెలుగు మహాసభలను నిర్వహించడానికి సమాయత్తమైంది.

ఇటీవల కాలంలో ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో రాజకీయ, సామాజిక, సాంస్కృతిక పరిణామాలు సంభవించాయి. వీటి నేపథ్యంలో బహుభాషా దేశమైన మన భారత దేశంలో తెలుగు భాష, సాహిత్యం, చరిత్ర, సంస్కృతి, కళలు మొదలైన విషయాల్లో జరిగిన కృషి గురించి, జరగవలసిన కృషి గురించి మనం చర్చించవలసింది ఎంతో ఉంది. ప్రపంచీకరణ నేపథ్యంలో మన తెలుగు భాష ఉనికిని కోల్పోకుండా పరిరక్షించేందుకు, తెలుగు ఔన్నత్యాన్ని నలుదిశలా చాటేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉంది. నిత్యం ప్రజల హితం కోరి, ప్రజల అభీష్టాలను నెరవేర్చేందుకు, తెలుగు జాతి దేశ విదేశాల్లో తలెత్తుకు తిరిగేలా చేసేందుకు అవిరళ కృషి చేస్తున్న మా ప్రభుత్వం, తెలుగు తేజం కాంతులు వెదజల్లేలా ఈ మహోజ్వలమైన సభల నిర్వహణకు పూనుకొంది. ఈ సభలలో సదస్సులు, తెలుగు వారి కళా ప్రదర్శనలు, చేతివృత్తుల ప్రదర్శనలు, లలితా కళా వైభవాన్ని చాటే కార్యక్రమాలు, రాష్ట్రేతర, విదేశాంధ్రుల సమావేశాలు, మొదలైన ఎన్నో అంశాలతో పాటు పుస్తక ప్రచురణ కూడ పెద్ద ఎత్తున చేపడుతున్నాం. అందులో భాగంగానే ఈ లఘుగ్రంథాల ప్రచురణ జరుగుతుంది.

ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఈ మహాసభల సందర్భంగా ప్రచురించే లఘు గ్రంథాలు పాఠకుల ఆదరణ పొందగలవని ఆశిస్తున్నాం.



(ఎన్. కిరణ్ కుమార్ రెడ్డి)

ముఖ్యమంత్రి

V. VASANT KUMAR, B.Sc.,(Ag.),M.B.A.
Minister for Tourism & Culture, Archeology & Museums,
Archives & Youth Services & Sports, N.C.C.
Government of Andhra Pradesh

सत्यमेव जयते

Room No. 501, 5th Floor,
J-Block, A.P. Secretariat,
Hyderabad-500 022.
Phone : 040-23454168, 23450541
Fax : 040-23450899



ప్రస్తావన

తెలుగువారు తెలుగు నేలపై 37 ఏళ్ళ విరామం తర్వాత చేసుకుంటున్న పండుగ ప్రపంచ తెలుగు మహాసభలు. మన సంస్కృతిని నలుదిశలా వ్యాపింప జేస్తున్న తెలుగు వారందరూ ఒక్కచోట చేరి, తెలుగు దనాన్ని పంచు కునేందుకు, తెలుగు పరిమళాలు వెదజల్లేందుకు ఉద్దేశించిన సన్నివేశం ప్రపంచ తెలుగు మహాసభలు. తెలుగు వారి సంస్కృతి బహుముఖీనమైంది. అందులో భాష. సాహిత్యం, చరిత్ర, లలితకళలు, జానపద, గిరిజన విజ్ఞానం వంటి ఎన్నో అంశాలున్నాయి. వీటన్నిటి గురించి విశ్లేషించుకుని, వాటిని పరిరక్షించడం, పోషించడం, పరివ్యాప్తి చేయడం ప్రభుత్వం తన విద్యుక్త ధర్మంగా భావిస్తున్నది.

ఈ బృహత్తరమైన బాధ్యతని నెరవేర్చే సంకల్పంలో భాగంగానే "ప్రపంచ తెలుగు మహాసభల" నిర్వహణకు ప్రభుత్వం నడుము కట్టింది. అతి తక్కువ వ్యవధిలో అత్యంత సమున్నత స్థాయిలో తలపెట్టిన ఈ మహాసభలకు దేశ విదేశాల నుంచి తెలుగువారు స్వాగతం పలుకుతున్నారు. అత్యధిక సంఖ్యలో ఈ సభల్లో పాల్గొంటున్నారు.

తెలుగు వారందరూ ఒక్కచోట సమకూడి, తమ గురించి చర్చించుకుని, భవిష్యత్తుకు బాటలు వేసుకునే క్రమంలో మన గురించి మనం మరోసారి తెలుసుకునేందుకు, వివిధ రంగాల్లో మనం సాధించిన దాన్ని పునశ్చరణ చేసేందుకు ఈ సభల సందర్భంగా సదస్సులు, లఘుగ్రంథాల ప్రచురణ, ప్రత్యేక సంచికల ముద్రణ,

వివిధ అంశాల్లో ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరుగుతున్నది.

తెలుగువారిది ఘనమైన చరిత్ర, అత్యున్నత సంస్కృతి. అయితే కాలంతో పాటు అభివృద్ధి పథంలో నడుస్తున్న తెలుగువారు ఎప్పటి కప్పుడు తమ సంస్కృతిలోకి కొత్త నీరును ఆహ్వానించడం సహజం. ఈ "పాతకొత్తల మేలు కలయికే" ఒక జాతిని నిత్యచైతన్యంతో నింపుతుంది. ఈ విధంగా కొత్త దనాన్ని ఆహ్వానిస్తూనే, మన గతవైభవాన్ని విస్మరించకుండా కాపాడుకోవలసిన బాధ్యత మన మీద ఉంది. ఇవన్నీ ఈ ప్రపంచ తెలుగు మహాసభల్లో చర్చకు రానున్నాయి. అందరం కలిసి, తెలుగుదనాన్ని పరిరక్షించుకునే ప్రయత్నం చేయవలసిన తరుణం ఆసన్నమైంది.

వీటన్నిటినీ దృష్టిలో ఉంచుకుని తెలుగువారి భాష, సాహిత్యం, సంస్కృతి, పౌరజీవనం తదితర అంశాలపై లఘుగ్రంథాలను నిష్ణాతుల చేత రచింపజేసి ప్రచురించే గురుతర బాధ్యతను పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం, తెలుగు అకాడమీ, రాష్ట్ర సాంస్కృతిక శాఖ నిర్వర్తిస్తున్నాయి. తెలుగు ప్రజలు కలకాలం ఉపయోగించుకునే విధంగా ఈ పుస్తక ప్రచురణ జరుగుతోంది. వీటిని పాఠకులు, తెలుగు భాషాభిమానులు, పండితులు ఆదరిస్తారని విశ్వ సిస్తున్నాను.

వ. వసంతకుమార్

(వట్టి వసంతకుమార్)

పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం
POTTI SREERAMULU TELUGU UNIVERSITY

ఆచార్య ఎల్లూరి శివారెడ్డి
ఉపాధ్యక్షులు

లలిత కళాక్షేత్రం,
పబ్లిక్ గార్డెన్స్,
హైదరాబాద్-500 004.

నివేదన

ఇన్నేళ్ళ తరువాత ప్రపంచ తెలుగు మహాసభలు జరగడం తెలుగు భాషా సాహిత్యాభిమానులకు, సంస్కృత ప్రియులకు, వివిధ రంగాలలో నిష్ణాతులైన మేధావులకు ఆనంద ప్రదమైన అంశం. 1975లో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభల ఉత్తేజం తోనే 1985లో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆవిర్భవించింది. తెలుగు విశ్వ విద్యాలయం ఈ రాష్ట్రంలోను, భారత దేశంలోను, విదేశాలలోను ఎన్నో సభలు, సమావేశాలు నిర్వహించింది. భాషా సాహిత్య సంస్కృతుల్ని దృష్టిలో ఉంచుకొని అనేక గ్రంథాలను వెలువరించింది. తెలుగు విశ్వవిద్యాలయం అప్పటి సాహిత్య అకాడమీ నిర్వహించిన పాత్రను చాలా వరకు బాధ్యతాయుతంగా నిర్వహిస్తున్నది. విస్తరణ సేవా విభాగాన్ని అకాడమీల విభాగంగా మార్చి దానికి సంబంధించిన కార్యక్రమాలను చేపడుతున్నది. నిధుల కొరత వల్ల కొన్ని కార్యక్రమాలను అనుకున్న స్థాయిలో చేయలేకపోతున్నాం.

ఈ నాలుగవ ప్రపంచ మహాసభల సందర్భంగా తెలుగు విశ్వ విద్యాలయం తన వంతు బాధ్యతను స్వీకరించింది. భారత దేశంలో పదిచోట్ల సన్నాహక సభలు ఇప్పటికే అధిక భాగం నిర్వహించింది. 1975లో మహాసభల సందర్భంగా ప్రచురించిన 30 లఘు గ్రంథాల్ని పునర్ముద్రిస్తున్నది. మరొక 50 గ్రంథాలను ప్రత్యేకమైన అంశాలమీద రాయించి ఈ మహాసభల సందర్భంగా విడుదల చేస్తున్నది. ఆయా రంగాలలో నిష్ణాతులైన వారిచేత ప్రామాణిక గ్రంథాలను రాయించాలన్నది మా విశ్వవిద్యాలయం ఆశయం. నిజంగా ఇంత స్వల్ప సమయంలో గ్రంథ రచన చేసి సహకరించిన రచయితలకు మా ధన్యవాదాలు. ఈ గ్రంథాల ప్రచురణకు ఆర్థిక సహకారం అందించిన ప్రభుత్వానికి ప్రత్యేకంగా ముఖ్యమంత్రి గౌరవనీయులు మాన్యశ్రీ నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి గారికి, సాంస్కృతిక శాఖామాత్యులు, మాన్యశ్రీ వట్టి వసంతకుమార్ గారికి, సంబంధిత ప్రభుత్వాధికారులకు మా విశ్వవిద్యాలయం పక్షాన కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ఈ పరంపరలో 1975 నాటి మొదటి ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా ముద్రించిన డా॥ ఎస్.వి.జోగారావు గారి "యక్షగానము" అనే గ్రంథాన్ని పునర్ముద్రిస్తున్నాం. గ్రంథముద్రణ కార్యక్రమంలో చేదోడు వాదోడుగా ఉన్న ఆచార్య సి.మృణాళిని గారికి, ఆచార్య డి. మునిరత్నం నాయకుడు గారికి అభినందనలు.

(ఎల్లూరి శివారెడ్డి)

పరిచయము

ఇరువై శతాబ్దాల తెలుగు చరిత్ర సంస్కృతి పునాదులపైన నిర్మింపబడ్డ తెలుగు జాతి సమైక్యతను సర్వతోముఖాభివృద్ధిని పటిష్టం చేయడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆధ్వర్యంలో రాక్షసనామ సంవత్సర ఉగాది (1975 ఏప్రిల్ 12వ తేదీ) నుండి వారం రోజులపాటు ప్రపంచ తెలుగు మహాసభలు జరుగుతున్నవి. ఈ మహాసభల ఏర్పాట్లకుగాను ముఖ్యమంత్రి శ్రీ జలగం వెంగళరావుగారు అధ్యక్షులుగాను. విద్యాశాఖ మంత్రి శ్రీ మండలి వెంకటకృష్ణరావుగారు నిర్వాహకాధ్యక్షులుగాను ఒక సంఘం ఏర్పడింది. ఈ సందర్భంగా 1975 సంవత్సరాన్ని తెలుగు సాంస్కృతిక సంవత్సరంగా పరిగణించడం జరుగుతున్నది.

ప్రపంచ మహాసభలకు నాందిగా రాష్ట్రంలోని పలు ప్రదేశాలలోను, ఢిల్లీలోను సంగీత, నాటక, నృత్య, జానపద కళోత్సవాలను నిర్వహించే బాధ్యతను, ఆయా కళారంగాలకు సంబంధించిన గ్రాంథాలను ప్రచురించే బాధ్యతను స్వీకరించవలసిందని ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక ఆకాడమీని ప్రపంచ తెలుగు మహాసభల కార్యవర్గం కోరింది. ఈ కార్యక్రమం క్రింద అకాడమీ విజయవాడలో నాటకోత్సవాన్ని, అనంతపురంలో వీధినాటకం సదస్సును, నిజామాబాద్‌లో నృత్యోత్సవాన్ని, తిరుపతిలో సంగీతోత్సవాన్ని ఢిల్లీలో ఆంధ్రప్రదేశ్ జానపద, నాటక కళోత్సవాన్ని నిర్వహించింది.

ఈ సందర్భంలో సంగీత, నృత్య, నాటక, చలనచిత్రాలకు సంబంధించిన గ్రంధాలను ప్రచురించే అవకాశం కల్పించి, అకాడమీ గ్రంథ ప్రచురణ కార్యక్రమానికి ప్రపంచ తెలుగు మహాసభల కార్యవర్గం దోహదం చేసింది. అందుకు వారికి మేమెంతో కృతజ్ఞులం. ఈ అవకాశాన్ని పురస్కరించుకొని ప్రచురించిన అనేక గ్రంథాలలో ఈ "యక్షగానము" ఒకటి. ఈ గ్రంధాన్ని రచించిన డా॥ తంగిరాల సుబ్బారావుగారికి మా ధన్యవాదాలు.

జె.బాపురెడ్డి
స్పెషల్ ఆఫీసర్
ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ

ముందుమాట

ఎన్నో ఏళ్లుగా అనుకొంటున్న ప్రపంచ తెలుగు మహాసభలు జరుగనున్న పర్వ సమయం ఆసన్నమవుతున్నది. ప్రపచంలోని తెలుగువారి ప్రతినిధుల నందరినీ ఒకచోట సమీకరించవలెనని పెద్ద లందరూ కన్నకలలు ఫలిస్తున్న శుభసమయమిది. రాబోయే ఉగాది రెండువేల అయిదువందల సంవత్సరాల తెలుగు జాతి చరిత్రలో మరపురాని మధుర ఘట్టము కాగలదు.

క్రీస్తుపూర్వం మూడవ శతాబ్దికి చెందిన శాతవాహన రాజుల కాలంనుంచి తెలుగు ప్రజలకు ఒక విశిష్టమైన చరిత్ర ఉన్నది. భారత దేశంలో తెలుగు మాట్లాడే ప్రజలు దాదాపు ఐదు కోట్లకు పైగా ఉన్నారు. హిందీ మాట్లాడే వారి తరువాతి స్థానం తెలుగువారిదే. బౌద్ధపూర్వయుగం నుంచి ఇటీవల బ్రిటీష్ సామ్రాజ్య పరిపాలనా యుగం వరకూ తెలుగువారు పెద్దఎత్తున ప్రపంచం నలుమూలలకూ వలస వెళ్లడం జరిగింది. అట్లా వెళ్లిన తెలుగువారు తమ భాషా సంస్కృతీ సంప్రదాయాలను ఆయా జాతీయ జీవన విధానాలతో మేళవించి, వాటిని సుసంపన్నం చేస్తూ ఉన్నారు.

ప్రపంచ తెలుగు మహాసభల ప్రధాన లక్ష్యం తెలుగు ప్రజల, తెలుగు అభిమానుల ప్రతినిధులను ఒక వేదికమీద సమావేశపర్చడం. జాతీయ, అంతర్జాతీయ సాంస్కృతిక రంగాలలో తెలుగువారు చేయవలసిన కృషిని గూర్చి చర్చించి, నిర్ణయించు కోవడానికి, తద్వారా వివిధ చైతన్య స్రవంతులను ఏకోన్ముఖం చేసి మన సాంస్కృతిక సంబంధాలను ధృఢతరం చేసుకోవడానికి ఈ మహాసభలు దోహదకారులు అవుతవి. అంతేకాక ఈ మహాసభలు ఆర్ద్రమైన భావసమైక్యతకు ప్రాతిపదికలై తెలుగు జాతిని సమైక్యం చేయగలవని, ఆ విధంగా జాతీయ అభ్యుదయానికి తోడ్పడగలవని విశ్వసిస్తున్నాను.

1975 ఏప్రిల్ 12వ తేదీన తెలుగు ఉగాది రోజున ప్రారంభమై ఒక వారంరోజుల పాటు జరిగే ఈ మహాసభలలో వివిధ దేశాలనుంచీ, వివిధ రాష్ట్రాల

నుంచీ, యునెస్కో వంటి అంతర్జాతీయ సంస్థల నుండి విచ్చేసిన ప్రముఖులు ప్రతినిధులుగానో, పరిశీలకులుగానో పాల్గొంటారు. ఈ మహాసభల సమయంలో చర్చాగోష్ఠులు, ప్రదర్శనలు, ప్రచురణలు మొదలైన కార్యక్రమాలు జరుగుతాయి. దేశ విదేశాలలోని తెలుగువారి సంస్కృతి, తెలుగు భాషా సాహిత్యాల, కళల అభివృద్ధి, వైజ్ఞానిక సాంకేతిక ప్రగతి మొదలైన విషయాలపై చర్చాగోష్ఠులు జరుగుతవి. తెలుగువారి సాంస్కృతిక వైభవాన్ని వివిధ కోణాల నుంచి ప్రస్ఫుటం చేసే ఒక ప్రదర్శన ఏర్పాటు అవుతున్నది. తెలుగువారి సమగ్ర స్వరూపాన్ని సందర్శించడానికి వీలైన సంగ్రాహాలయాన్ని 'మ్యూజియంను' స్థాపించడానికి ఈ ప్రదర్శన బీజభూతమవుతుంది. తెలుగువారి సంస్కృతి నిరూపించే సాంస్కృతిక కార్యక్రమాలు వారం రోజులపాటు సాగుతవి. తెలుగు ప్రజల సంస్కృతీ సంప్రదాయాలను విశదంచేసే ప్రత్యేక సంచికలు తెలుగు, ఇంగ్లీషు, హిందీ, ఉర్దు భాషలలో విడుదల అవుతాయి. ఈ కార్యక్రమాలలో భాగమే ఈ గ్రంథ ప్రచురణ.

తెలుగు ప్రజలు భాష, సాహిత్యం, చరిత్ర, సంస్కృతి, కళలు మొదలైన వివిధ రంగాలలో సాధించిన ఘనవిజయాలను విశదంచేసే గ్రంథాలు అనేకం. ఈ మహాసభల సమయంలో విడుదల అవుతాయి. ఈ గ్రంథాలను రచించి, సకాలంలో మాకు అందించిన రచయితలందరకూ నా కృతజ్ఞతలు. ఈ గ్రంథాలను ప్రచురించే భారం వహించడానికి ముందుకు వచ్చిన అకాడమీల అధినేతలను అభినందిస్తున్నాను. తెలుగు వారి విశిష్టతలను విశదంచేసే ఈ గ్రంథాలు సహృదయులందరి ఆదరణ పొందగలవని విశ్వసిస్తున్నాను. అయితే, ఇంత మాత్రం చేతనే ప్రపంచ తెలుగు మహాసభల ఆశయాలు సఫలం కాగలవని నేను అనుకోవడంలేదు. చేయవలసినది ఇంకా ఎంతో ఉంది. ఈ మహాసభల సందర్భంగా నెలకొల్పబడనున్న 'అంతర్జాతీయ తెలుగు విజ్ఞాన సంస్థ' మహాసభల ఆశయ సాధనకు పూనుకొనడమే కాక జాతీయ, అంతర్జాతీయ సాంస్కృతిక సంబంధాలను దృఢతరం చేయగలదని నమ్ముతున్నాను.

జలగం వెంగళరావు
అధ్యక్షులు,
ప్రపంచ తెలుగు మహాసభలు

యక్షగానము

ప్రస్తావన :

నిచ్చలు పచ్చి బాలెంతరాలగు ప్రకృతి సవిత్రికి స్తనంధయుఁడైన ప్రాక్తన మానవుఁడా మాతృహృదయ మాధుర్యమును చూఱఁ గొని కొట్టిన కేరింతయే మానవజాతి గానకళాభ్యుపాసనకు సత్సంకల్ప మైనది. తనకంఠము నుండి వెలువడిన మధురస్వరములేవో తనకర్ణ పుటములనేపడి మరలఁదనలోనే ప్రవేశించి మాఱెలుఁ గిచ్చినట్లు దన నాడీ తంత్రులలోఁ గలిగించిన కదలికే యతని కరచరణముల నుండి బహిర్గమించి నృత్యకళా సరస్వతి కేటికోళ్ళెత్తినది. ఆటపాటల నపుడే ప్రవీణుఁడై నిరంతర వర్ధమానుఁడగుచుండిన మానవుని యనుకరణ ప్రవణశీలము, నందులో యంతర్భూతమైయున్న సృజనకళా కుతూహలము బొమ్మలాటకు, నాటక కళకును బురుడుపోసినవి. అతని సంతానమే ప్రపంచమున వివిధ ప్రదేశములలో శాఖోపశాఖలై విభిన్న కళాభిరుచులతో విరాజిల్లుచు వచ్చినది. ఒక్కొక్క జాతియొక్క భాష సాహిత్య స్థితికి వచ్చిన తరువాత నందుఁగొంతకాలమున కాయాజాతి యొక్క నిసర్గ గీతాభినయ కళాభిమాన ప్రత్యేకతలకును గాణాచియైన కావ్యజాలము వెలయఁ గలదు. జావాదేశమునందలి వాయంగ్‌వోంగులు, జపానీయుల 'నో' రూపకములు, బర్మాదేశపు 'లూసన్', 'హౌసా', సింహళ దేశీయుల 'కోలమ్‌నాటిమా', టిబెట్ ప్రభృతి దేశముల మిస్టరీలు, మన దేశమందలి యాత్రలు (బెంగాలు), కధకళి (మళయాళము), గంధర్వగానము (నేపాలు) గంధర్వ నృత్యము (మార్వారు), యక్షగానము (ఆంధ్ర కర్ణాట తమిళ ప్రాంతములు) మొదలగునవట్లు వెలసినవే, ఒక్కొకదాని యుత్పత్తి కొక్కొక కారణముండవచ్చును. కాని యన్నిటఁదత్త్వతః ఏదో సమీచీనమైన సమానత గోచరించును. అది మానవ స్వభావ నిసర్గ మధురములగు నభిరుచులకును

దత్తజ్ఞాతీయాశయములకును సంప్రదాయములకును గల భావ బాంధవ్యము. కొన్ని కొన్నిట వస్తువులలో రచనా ప్రక్రియలో, ప్రదర్శన సంప్రదాయములలోఁ గూడఁ గొంత సామ్యము గోచరించిన గోచరింపవచ్చును. భిన్న దేశములందు భిన్న కాలోత్పన్నములైన కళాస్వరూపములందు సామ్యమున్నదనగా నది మానవ స్వభావములోనేయున్న సమానతా ప్రతిపత్తియేగాని వేఱు కాదు. ఆ సమానతా ప్రతిపత్తిని బట్టి యాయా భిన్నదేశ కళా ప్రక్రియల కన్నిటికినిఁ బరస్పరానుకరణ సంబంధము నూహించుట సమంజసము గాదు. ఏనాఁడో కొన్నిటికట్టి సంబంధమేర్పడి యుండి నను నీ నాడు నిజము నిక్కచ్చిగా నిరూపించుట కష్టసాధ్యము.

ఆంధ్రతా ముద్రను భద్రపరచిన మనదేశి సాహిత్య ప్రక్రియల కెల్లఁ దలమానికము యక్షగానము. అది ప్రాదుర్భవమున నేదో సాధారణ మతబీజక వినోద కాలక్షేపమై యుండినదేమో కాని రానురాను ఒక ప్రత్యేక సాహిత్యశాఖగా వర్ధిల్లుచూ వచ్చినది. అట్లని అదివట్టి సాహిత్య ప్రక్రియ మాత్రముకాదు. సంగీతాభినయ కళలకునుఁ దానకమై దేశి సంస్కృతికోశమై పరిఢవిల్లినది. యక్షగాన గ్రంథములు ఆంధ్రమునఁ బరశ్శతముగా వెలసినవి. కధకళి కళాప్రతిష్టలుగల మలయాళ రాష్ట్రము వినా యావద్దక్షిణ భారతదేశ వ్యాప్తమైన కళా స్వరూపము యక్షగానమని చెప్పనొప్పును.

యక్షులు - గానము :

ఆంధ్ర జాతీయ రూపక ప్రక్రియగా యక్షగానమున కాపేరెట్లు వచ్చినదో విచార్యము. యక్షగానమనఁగా యక్షుల యొక్క పాట యని సామాన్యార్థము. మఱి యాంధ్రులకు యక్షులకు నేమి సంబంధమో దురూహ్యము. ఈనాఁడు మనకుపలబ్ధమగు యక్షగానములలోఁ బ్రాచీన కృతులందుఁ గూడ యక్షగాధలుగాని, యక్షపాత్రలుగాని, యక్షస్తోత్రములుగాని, మఱియేవిధమైన యక్షసంబంధములుగాని కానరావు. కాని ప్రత్యక్షముగా యక్షులతోఁ గాకున్నను యక్షశబ్ద వాచ్యులగు నెవరితోనైన నేనాఁడో ప్రగాఢమైన సంబంధమేదో యుండి యుండకున్నచో ఈ పదము యొక్క పుట్టుక కవకాశమే యేర్పడియుండదు.

ఆంధ్ర వాఙ్మయమున మొట్టమొదట యక్షాది నేపథ్యముల తోడి యాటపాటల ప్రసక్తి పాల్కురికి సోమనాథుని (క్రీ॥శ॥ 1280-1340) పండితారాధ్యచరిత్రలో బర్వత ప్రకరణమునఁ గన్పట్టును. అది శ్రీశైలయాత్ర శివరాత్రి జాగరణ సందర్భము. ఆవేళ నచటఁ జేరినయాత్రికుల వినోదకాలక్షేపములనేకము వర్ణింపఁబడినచోట-

"ఆదట గంధర్వ యక్షవిద్యాధ
రాదులై పాడెదు నాడెదువారు(రి?)
విధమునఁ బ్రచ్ఛన్న వేషముల్ దాల్చి
యధికోత్సవముదులుకాడనట్లాడు"

తదుపరి క్రీ॥శ-- 1430 ప్రాంతమున రచితమైన శ్రీనాథుని భీమేశ్వర పురాణమున (ఆశ్వా 3, పద్య 65) దక్షారామ ప్రశంస సందర్భమున-

"కీర్తింతురెద్దాని కీర్తి గంధర్వులు
గాంధర్వమున యక్షగాన సరణి"

అనియున్నది. యక్షగాన మను సమస్త పద మొక విశిష్టార్థమున గనఁ బడుట కిదే మొదలు.

"కీర్తియంతి స్మమాహాత్మ్యం గంధార్వాస్తి దివౌకసః
గాంధర్వ విద్యా నిపుణా గాంధర్వేణగరీయసా"

అని సంస్కృత భీమేశ్వర పురాణము (అధ్యా 10-శ్లో 19) అమూలకమగు యక్షగాన శబ్దమాంధ్ర భీమేశ్వర పురాణమున నుటంకింపఁబడినదనఁగా శ్రీనాథుని కాలమున యక్షగానమున కొక ప్రత్యేకతయుఁ బ్రచారమునేర్పడి యుండును. అసలు గానకళా ప్రావీణ్యమునకు గంధర్వులకిది పెట్టినది పేరుగదా. వారి పేరనే గాంధర్వ వేదము వెలసినది. అట్టి గంధర్వులు "యక్షగానసరణి", బాడిరనఁగానది శ్రీనాథుని కాలము నాఁడొక ప్రత్యేక గానశైలిగాఁ బఱిగణింపఁ బడుచుండెడిదని తోఁచును. క్రీడాభిరామమున (క్రీ॥శ॥ 15శ). నొక వ్యాజమున మాణిభద్రకులోద్వహులైన యక్షకన్యల నృత్య ప్రశంసగలదు. (పద్య 37-138) 16 వ శ. ప్రబంధములలో

మనుచరిత్రమునఁ (II–19) బ్రవరుఁడుహిమవత్పర్వత ప్రాంతమున "గంధర్వ యక్షగాన ఘూర్ణితమగు నొక్క కోనఁగనియె ననియున్నది. పారిజాతాపహరణమున "యక్షగ్రామవాస్తవ్యులు" నిర్జరీజనతా నృత్తసహాయలాలసు" లనియు, "యక్షులు మేళముగూడి పాడుచుందురు దిక్పాల సభల" ననియున్నది. (II–92–93) రామాభ్యుదయమున (111–42) "...గరుడ గంధర్వ కిన్నెర కింపురుష యక్షగానంబులనూనంబులై బేరయ..." అనియున్నది. చిత్ర భారతమునఁ జతుర్థుని యలకాపురీ సందర్శన సందర్భమున, (IV–80) గిన్నరులు పాటపాడుచుండగా "తాళసంఘ ప్రభేదంబుల గతులచే యక్షకామినులు నాట్యంబులాడ" దొడఁగిరనియు, నందే కృష్ణుఁడర్జునునిపై దాడివెడలిన సందర్భమున (VII–80) "మంగళమస్తు రమానాథయని యక్షవనితలు కర్ణపర్వముగబాడ" దొడఁగిరనియుఁగలదు. కర్ణాటాంధ్ర వాఙ్మయములందు యక్షుల గానాభినయ కళానుబంధములకిట్లెన్నియో ప్రమాణములు గలవు. కాని యవి క్రీ.శ. 12వ శతాబ్దికంటేఁబ్రాచీనములుగావు. అంతకంటేఁబ్రాచీనములు ప్రబలములైన ప్రమాణములుగా గాన రావు. కావునఁ గర్ణాటాంధ్రములందు యక్షగానమను పేరనొక ప్రత్యేకమైన గానశైలికి ప్రచారమేర్పడిన తరువాతనే తన్నిమిత్తముగాఁదత్తత్సాహిత్యములందు భంగ్యంతరము గాను, నౌపచారికముగను యక్షుల గీతాభినయకళానుబంధములకా ప్రసక్తి గల్గినదని తలంపవలసి యున్నది. అదియుఁగాక దేవయోనులైన యక్షులవలన నాంధ్ర కర్ణాటములందు యక్షగాన మేర్పడినదనుటకంటే నెవరో భౌమజీవులైన యక్షులవలన నేర్పడి యుండుననుట సమంజసముగాఁ దోచును. యక్షజాతి ప్రతిష్ఠ హిందూ బౌద్ధ, జైన మత గ్రంథములు మూడింటను నిటు సింహళమునుండి యటు నేపాళము వఱకును వ్యాపించినట్లు తెలియుచున్నది. కర్ణాటాంధ్ర దేశములకు నేపాళము కంటే సింహళము సన్నిహితమైనది. ప్రాచీన కాలమున సింహళమున యక్షుల రాచరికము గొన్నినాళ్ళు కొనసాగిన విషయము పూర్వోక్తము. అచట నేఁటికిని యక్షారాధన ప్రధానముగా "వడ్డా" యను జాతివారి యుత్సవ నృత్యములు జరుగుచుండునని తెలియచున్నది. ఆ యుత్సవములు మతబీజకములఁట. ఆ యక్షులెవరో నృత్య ప్రియులవలెనున్నారు.

ఆట తోడిదే పాట మత ప్రచారమునకు గీతాభినయ కళాత్మక ప్రక్రియలు గొప్ప సాధనములు. పూర్వమెపుడో సింహళమునుండి యీ యక్షులో యక్షారాధకులో మత ప్రచారము నిమిత్తమో మరెందులకో కర్ణాటాంధ్రదేశములు బ్రవేశించిరేమో! యనునదొక విచికిత్స. కర్ణాట దేశమునందలి యెక్కల గాణలు లేక యెక్కగిసలు, నాంధ్రదేశమందలి. జక్కులవారును వీరి సంతతివారే యగుదురేమో! ఎక్క జక్క శబ్దములు యక్షశబ్ద భవములగుటను భాషా శాస్త్రము సమర్థింపగలదు. తొల్లికర్ణాటాంధ్రములందు యక్షగానము వీరివల్లనే ప్రవర్తిల్లినదేమో!

పూర్వ కాలమున వివిధ దేశములందు వెలసిన నాట్య సంగీత ప్రక్రియలనేకము మత ప్రచారము కొఱకేర్పడియుండుట లేదా మత బీజకములై యుండుట ప్రసిద్ధ విషయము. కాత్యాయని శ్రౌత సూత్రములలో (21-3-11) బితృమేథకర్మ కాండమున నొకవిధమగు గీతాభినయ ప్రక్రియ యాచరణీయమని సూచింపఁబడినది. సింహళ దేశీయుల యుత్సవ నృత్యములలోఁబితృదేవతా పూజా సంప్రదాయముఁబాటింపఁ బడుచున్నది. గ్రీసుదేశపు నాటకోత్పత్తికి మతసంబంధ ప్రతిపత్తియే మౌలికతత్త్వము. ఆనాఁటి గ్రీసు "ట్రాజెడీ" (విషాదాంత రూపకము) మొదట నొక మృతయోధుని సమాధికడ జరుపబడు నపరకర్మ కలాపముగా నవతరించినది. అశోక చక్రవర్తి విగ్రహ ప్రదర్శనాదికము ద్వారమున బౌద్ధమత ప్రచారము చేయించినట్లాతని నాగిర్నారువ శిలాశాసనమువలనఁదెలియుచున్నది. వంగదేశపు "యాత్రలు" మత విషయకములైన యుత్సవములలో నూరేగింపుల సందర్భములలోఁప్రయోగింప బడునట. మార్వారు ప్రాంతమున వైశ్య జాతికిఁజెందిన గంధర్వులను నొక తెగ వారది యొక వృత్తిగాఁబ్రదర్శించు అంజన సుందరి, మేనా సుందరియను నృత్య రూపకములందా యితివృత్తములు ప్రసిద్ధజైన గాథలనియు నా ప్రదర్శనములను జైనులెక్కువగా నాదరింతురనియు, నాగంధర్వుల కదియొక వృత్తియైనను నదిమత బీజకమైన దనియుఁదెలియుచున్నది. ఇట గంధర్వ శబ్దోపయోగము గమనింపఁ దగినది. ఈ గంధర్వులకును దేవయోనులైన గంధర్వులకును సంబంధములేదు. గానకళా ప్రావీణ్య విషయమునఁబురాణ ప్రసిద్ధులైన దేవయోని గంధర్వులపేరే

వైశ్యజాతి ప్రదర్శకులు తమ గానకళా వైదగ్ధ్యమునకు సూచకముగాఁబెట్టుకొని యుందురు. లేక జనవ్యవహారమున వీరికా ప్రసిద్ధి గలిగియుండును. ఇంతకన్నను జిత్రమైనది నేపాళదేశపు గంధర్వగానము. ఇది వంగదేశపు యాత్రవలె నేపాళ దేశము యొక్క దేశి సరణికిఁజెందిన (నర్తన) నాటకమని పేర్కొనఁబడినది. ఇది మత బీజకమైనదో కాదో తెలియదు. కాని దీనికిని మన యక్షగానమునకును బేళ్ళలో నేదోయొక వింతసామ్యము గోచరించును. ఇఁక యక్షగానమునకేమైన మత సంబంధమున్న దేమో చూడవలసియున్నది. సింహళదేశపు యక్షులచేఁగాని యక్షారాధకులచేఁగాని ప్రవర్తితమై యందునెడల నది యంతయో యింతయో మత సంబంధియిని చెప్పనొప్పును. లేదా మీఁదఁజెప్పఁబడిన కర్ణాట దేశపుఁప్రదర్శన సంప్రదాయమును గమనించినను మతబీజకమైన దేశపుఁప్రదర్శన సంప్రదాయమును గమనించినను మతబీజకమై యుండునని దోఁచును. కాక, పాల్కురికి సోమనాథుఁడు చెప్పినట్లు శివరాత్ర్యుత్సవ సందర్భమున శ్రీశైలాది క్షేత్రములందుఁ బ్రవర్తితమగు చుండిన యక్షవేషధారుల యాటపాటలలో యక్షగానమునకు సంబంధముండి యుండునెడల నదియు మత సంబంధక స్ఫోరకమగుచున్నది జక్కుల జాతి సంబంధముగూడ యక్షగానము యొక్క మత బీజకత్వమును స్థాపింపఁగలదు. అది యెట్లు స్థాపింపఁ బడఁగలదో, యసలు యక్షగానమునకును జక్కులకు గల సంబంధమేమిటో విచారింపవలసియున్నది.

జక్కుల జాతి అనుబంధము :

యక్షగానముతో సంబంధము గలిగినవారుగా సూహింపఁదగిన యెక్కడిగలు లేక యెక్కలగాణలు నేఁడు కన్నడ దేశమున నెక్కడను గానరారు. కాని జక్కుల వారాంధ్రదేశమున గుంటూరు, గోదావరి మొ॥ మండలములలోఁదేవాలి, పెద్దాపురము మొ॥ ప్రాంతములలోఁగానవచ్చుచున్నారు. నేఁడు వీరు కళావంతుల తెగకుఁ జెందినవారై యున్నారు. వీరి గుఱించి ఇ.థర్స్టన్ (E.Thurston) వ్రాసిన Castes and Tribes of South India అను గ్రంథము ద్వితీయ భాగము 438వ పుటలో నిట్లున్నది.

"Jakkula-Described as an inferior caste of prostitutes, mostly of the Balija cast; and as wizards and a dancing and theatrical caste. At Tenali in the Krishna district, it was customary for each family to give up one girl for porstitution etc. etc., దీనినిబట్టి జక్కులవారికి నాట్యకళతో సంబంధముండినట్లు విశదమగుచున్నది. కళావంతులనిపించుకొను వారియెడ నట్టిసంబంధము సహజము; వారి కొలము బిరుదుసార్థకము. మార్వారు గంధర్వుల సామ్యమున నీ జక్కులవారు తొల్లిమతప్రచార నిమిత్తముననో లేక యదియొక ప్రధాన వృత్తిగా నవలంబించియో యక్షగాన ప్రవర్తకులైన వారెల్లఁగాలక్రమమునఁగలసి యేర్పడిన జాతియనియు, వారి వృత్తికి సంబంధించిన యక్ష (జక్క) శబ్దము తరువాత వారికి జాతి వాచకముగాఁబరిణమించి యుండుననియు నూహింపవచ్చును. వివిధ జాతుల చరిత్రలు తఱచి జూచిన నిట్టి పరిణామమ సహజముగాదు. అందులకు మార్వారు గంధర్వుల విషయమునే దృష్టాంతముగా గ్రహింపమగును. మన 'ఎఱుకల' జాతియు నట్లే ఏర్పడినదిగదా.

ఆంధ్రదేశమున జక్కులవారి ప్రశస్తి చిరకాలానుగతముగా వినవచ్చుచున్నది. ఈనాఁడు రాయలసీమలోనున్న జక్కసానికుంట్ల (కర్నూలు జిల్లా, పత్తికొండ తాలూకా), జక్కుల చెఱువు (గుత్తి తాలూకా) జక్కల చెఱువు (పెనుగొండ తాలూకా, జక్క సముద్రము (హిందూపురం తా.) జక్కులాడి (బళ్లారి జిల్లా) మొదలగు గ్రామముల నామములు ప్రాచీన కాలమున నాయా ప్రాంతములందలి జక్కులజాతి ప్రాచుర్యమును సూచించుచును. అందుఁగొన్ని గ్రామములొకప్పుడు వారి కినాములుగా నీయఁబడినట్లు స్థానికమైన ప్రతీతిగలదు. క్రీ.శ. తే. 9-7-1481న జక్కుల కన్నాయి యను నామె తిరుమల దేవస్థానమున వేయించిన శాసనమొకటి కలదు. అది క్రీ.శ. 15వ శతాబ్దినాఁటి జక్కులవారి ప్రాభవమును సూచించును.

ఇఁక నానాఁడు గానాభినయ కళాప్రదర్శనలందు వారికిఁగల పేరు ప్రతిష్ఠ లెట్టివో యరయువలసియున్నది. పదునైదవ శతాబ్దారంభమున వెలసిన క్రీడాభిరామమున (135వ పద్యము) "జక్కుల పురంధ్రి" గానకళా కౌశలము

విశేషముగఁ ప్రశంసింపఁబడినది. అందే యా వెంటనే (పద్య 136-138) భంగ్యంతరమున 'అక్కలు' లేక "యక్షకన్యల" అనఁగా జక్కుల పడుచుల నృత్య ప్రదర్శనము గూడఁబ్రసక్తమైనది. జక్కుల రేకులను పదములు జక్కిణియను నృత్య విశేషము వీరి పేరనే ప్రసిద్ధులై యుండును. క్రీ.శ. 1500 ప్రాంతమునఁబ్రోలుగంటి చెన్న శౌరి యనునాతఁడు సౌభరిచరిత మను "జక్కులకథ" చెప్పినట్లు తెలియుచున్నది. అది జక్కులవారు చేయు గానరూప కథాఖ్యాన పక్కిక మూఁదలగా రచింపఁబడి యుండును. పురాణాదులలోఁగాన రాని యక్షుల గానకళా ప్రశంస మన భీమ ఖండమునను 16వ శతాబ్ది ప్రబంధములందును గన్పట్టు చున్నదనఁగా (ఈ విషయము పూర్వోక్తము) నదియీ జక్కుల వారి పాటలు వ్యాప్తికి వచ్చిన తరువాత వానికే భంగ్యంతర సూచనయని గ్రహింపవచ్చును. చిత్రభారతమున "యక్షకామినుల నాట్యము", "యక్షవనితల పాట" యుఁబ్రత్యేకముగ బేర్కొనబడిన వనగా నవియు నీజక్కుల పురంధ్రుల యాటపాటలకే భంగ్యంతర సూచనలగునేమో! 17వ శతాబ్దినాటి పురుషోత్తమ దీక్షితుని తంజా పురాన్నదాన మహానాటకమున జక్కుల రంగసానియను నామె సత్రములోఁబదకేళిక పట్టినట్లు గలదు. ఈ విషయములెల్ల జక్కుల జాతికి గీతాభినయ కళలతోఁగల సంబంధము నూహించుటకుఁదోడ్పడుచున్నది.

ప్రాచీనత - ప్రాథమికావస్థ :

యక్షరాత్రి, బౌద్ధయక్షులు, జక్కిణి మొ॥ విషయములతోడి సంబంధమునేదైన స్థిరపఱుఁపగల్గినచో యక్షగాన చరిత్ర మతి చిరంతన మైనదని చెప్పవచ్చును. కాని యట్టి సంబంధమును స్థాపించుటకుఁదగిన యాధార సామాగ్రి సౌలభ్యము కానరాని యీ నాఁడది కడుకష్ట సాధ్యము. ఆధారము లుపలబ్ధమానము లగుచున్నంతలో యక్షగాన చరిత్రమంత ప్రాచీనమైనది కాదనియే చెప్పవలెను. కాని కన్నడ పండితులు కొందఱు తమ వాఙ్మయమున యక్షగానము కొంత ప్రాచీనమైనదనియే తలంచు చున్నారు :- "Kannada scholars are of the opinion that as early as the 9th Century A.D., this Kind of Composition Could be traced. They suggest that Chattana" Nalpagarana" etc., mentioned in Kavirajamarga of Nripatunga

(814–817 A.D) are nothing but Yakshagana Works." కాని కవిరాజ మార్గమునఁ బేర్కొనఁ బడిన చత్తాణాదులకు లక్ష్యగ్రంథము లిపుడు కన్నడ వాఙ్మయమున లభించుటలేదు. "But unfortunately no Composition of this kind has come down to us to verify their statements" అని యనియున్నారు గోవిందరావుగారు. అయితే కవిరాజమార్గమున వాని లక్షణముక్తమైనది అది పరిశీలనార్హము.

"కందము మమళిన వృత్తము
మొందొందడెగొందు జాతి జాణెనెయెచెడం
గొందివరళ మరెపేఱ
ల్సుందర రూపింబిం దెండె గబ్బమదక్కుం"

- కవిరాజ మార్గము 1-34

"కందళ్ళల వాగిరె
సుందర వృత్తంగళక్కరం చవుపది మ
త్తంగ్గీతకె తివదిగ
ళందంబు త్తెసెయె పెళ్ద్వడదు చత్తాణం"

- కవిరాజ మార్గము 1-35

అనఁగానొకకందము, పిదపనొక వృత్తము చొప్పున రచించుచు నొక్కొకయెడ జాతుల ననుసంధించినచో నది 'బేదండె' కబ్బమగును. పలు కందపద్యములతో నందమైన వృత్తములను, అక్కర, చవుపది, గీతిక, తివది (త్రిపది) మొదలగు వాని నందముగా ననుసంధించినచో నది చత్తాణచందమగును, పై రెండింటను గందపద్యము ప్రాధాన్యము, వృత్తముల ప్రతిపత్తి, అక్కరాది జాతుల యక్కఱ విశద మగును. కాని నేఁడు పలబ్ధమగు కన్నడ యక్షగానము లను పరిశీలించినచోఁ గందములు నందందు వృత్తములునుగలవు కాని అక్కరాది జాతులన్నియును లేవు. అక్కరలసలు లేవు. కడమవాని ప్రయోగమతి విరళము వానిలోఁ గవిరాజమార్గమున జెప్పఁ బడని రగడ వికారములగు తాళ ప్రధానములగు రేకులకును, ద్విపదలకే ప్రాధాన్యము మరియు వానిలో వచనములు, పదములు, అర్ధచంద్రికలు, షట్పదులు, ధవళ

శోభనములు, మొ॥ రచనా విశేషములు కలవు. ఇవియు గవిరాజు మార్గబేదండే చత్తాణ కావ్యలక్షణములందుఁ బేర్కొనఁబడ లేదు. పై ఁబేర్కొనఁబడిన కన్నడ యక్షగాన లక్షణములే తెలుఁగు యక్షగానములందును గన్పట్టును. చూఁడగా నా బేదండె చత్తాణము లేవో సామాన్యములైన నిర్వచన పద్యకావ్యములై యుండునని తోఁచునుగాని యక్షగానము లనిపింపవు.

ఇఁకఁ గవిరాజ మార్గమునఁ బేర్కొనఁబడిన నాళ్ పరగణాల విషయము: నాళ్-నాడు అనఁగా దేశము. పరగణ-ప్రకరణము అనఁగా రూపకము. (అసలు ప్రకరణము ప్రసిద్ధ సంస్కృతదశ రూపక ప్రభేదము. మాలతీ మాధవ, మృచ్ఛకటికాదు లట్టివి. కాని యాలక్షణ మిటఁబ్రసక్తము కాలేదు. ప్రకరణ శబ్దమిట రూపక సామాన్య వాచిగాఁబ్రయుక్తమైనట్లు తోచును. అనఁగా దేశీయమగునొక రూపక విశేషమని యర్థము, ఇందుఁగ్లిష్టకల్పనాదులు దోషములనియు, గ్రామ్యాశ్లీల భూషణములు హాస్యరస భాజనములు కాగఁలవు. కానవవి దోషములనిపించు కొనవనియుఁ కవిరాజ మార్గమునఁగలదు (చూ ఆ. 1-వ. 66-68) ఈ లక్షణము యక్షగానములకే గాదు సామాన్య జనామోదములగు దేశిరూపకముల కన్నిటికిఁదగియున్నది. అవి యక్షగానములేయని నిష్కర్షతోఁ జెప్పవలనుపడదు. ఇట్లే నృప తుంగునకు సుమారొక శతాబ్ది (పై చిలుకు) యర్వాచీనుఁడగు నాగవర్మ రచించిన కన్నడ కావ్యావలోకములోఁ బేర్కొనఁబడిన 'పారుగబ్బాలు', 'భాజన గబ్బాల' ననునవి గేయకావ్యములు, గేయాభినయానుకూల దృశ్యప్రబంధములనియుఁ దెలియుచున్నది. కాని యవియు యక్షగానములని నిష్కర్షతోఁ జెప్పవలనుపడదు. అయితే యివి యన్ని యుఁగన్నడ దేశమున సంగీత నాట్యకళల కానాఁడుగల "పరపతి"నిఁ దెలియఁజేయఁగలట్టివైనఁ గావచ్చును.

అసలు కన్నడమున యక్షగానరచన మిగుల నర్వాచీనమైనది. ఆ విషయమును బలువురు కన్నడపండితులే యంగీకరించియున్నారు. ప్రత్యేకముగ కన్నడ యక్షగాన వాఙ్మయము గురించి పరిశోధన చేయబూనిన శ్రీ ఎం.గోవిందరావుగారు దాని గురించి వ్రాయుచు "In a study of a good number of Yakshagana works, was

not able to come across a work earlier than the end of the 17th Century".
అని వక్కాణించియున్నారు. తమిళమున యక్షగాన రచన మరియు సర్వాచీనమైనది. తెనుఁగుననే ప్రాచీనతమమైనది. ఈ సందర్భమున డా॥ నేలటూరి వేంకటరమణయ్య వాక్యములు స్మరింపఁదగినవి :- 'తెలుగు యక్షగానములు ప్రాచీనతమములు. తమిళ కన్నడ యక్షగానము లాదేశము లందాంధ్రుల వ్యాపన మతిశయించిన పిమ్మటనే రచింపబడెను. అయితే తెనుఁగు యక్షగాన రచనయెంతో ప్రాచీనముగాదు. క్రీ॥శ॥ 16వ శతాబ్దికి ముందునాటి యక్షగాన రచన తెనుగున గానరాదు క్రీశ. 15వ శతాబ్దికి ముందు యక్షగాన రచన జరిగినట్లే తెలియవచ్చుటలేదు. కాని యక్షగాన మొక సాహిత్య ప్రక్రియగా నవతరించుటకుఁ బూర్వ రంగముగాఁగొంత చరిత్ర యుండకపోదు. 15వ శతాబ్దికి పూర్వార్థమున వెలసిన మన క్రీడాభిరామమున జక్కుల పురంధ్రుల పాటలును యక్షకన్యల యాటలును ప్రసక్తములైనవికదా! అసలు యక్షగాన శబ్దమే యదియొక ప్రత్యేకమైనగాన శైలి యనునర్థమున నానాఁటి భీమఖండ మునఁబ్రయుక్తమైనదికదా. పండితారాధ్య చరిత్రయందలి యక్షాది నేపథ్యములతోడి యాట పాటల ప్రసక్తిని బరిగణించినచో యక్షగానము చరిత్రమింకొక శతాబ్ది వెనుకకుబోవును. కన్నడ వాఙ్మయ ముందలి" "అగ్గళుని చంద్రప్రభాపురాణము" అభినవ పంపని మల్లినాథ పురాణము లందలి ఎక్కలగాణ"ల ప్రసక్తి నెత్తుకొన్నచో యక్షగాన చరిత్ర క్రీ.శ. 12వ శతాబ్దిదాఁక నెగఁబ్రాకఁగలదు. అంతకుమించిన దంతయు నుపాధి సమగ్రముగాని యూహాగానమే.

ఇఁక యక్షగానముయొక్క ప్రాథమికస్థితి యెట్టిదో యించుక పరిశీలింతము. క్రీ.శ. 12వ శతాబ్దినాటికి కన్నడ చంద్రప్రభా పురాణములో వనవిహారం చేస్తూన్న నాయకుఁడు మేళ తాళాలతో నిమిత్తం లేకుండా దేశీయ గీతాన్నొకదానిని ఒక "ఎక్కలగాణ" యింపుగా పాడుతూ వుంటే విన్నాదని వర్ణించబడింది. దీనిని బట్టి మేళతాళములతో నిమిత్తములేని యెక్కలగాణల జాతీయ గీతాలాపము యక్షగానోత్పత్తికిఁబ్రాతిపదికయైనదని తోఁచుచున్నది. ఆ శతాబ్దిలోనే వెలసిన మల్లినాథ పురాణములో "కమలామోది యైన తుమ్మెద ఝుంకారం కమలాలయయైన లక్ష్మిని

కీర్తిస్తూ పాడే "ఎక్కల" గానంతో పోల్చి వర్ణించబడింది" అనఁగా యెక్కలగానము లేక యక్షగానము దేవతాస్తుత్యాత్మకమైనదని తెలియుచున్నది. శ్రీనాథుని భీమఖండము నందలి దక్షారామ ప్రశంస సందర్భమనఁగల కీర్తింతురెద్దాని "కీర్తిగంధర్వులు, గాంధర్వమున యక్షగాన సరణి" అను వాక్యమును జూచిననునాఁడు యక్షగానము దైవస్తుత్యాత్మకమైన యొక ప్రత్యేక గానశైలిగాఁబరిడవిల్లుచుండినదని స్ఫురింపజేయు చున్నది. మల్లినాథ పురాణములోనే "యక్షాందోళన" మను నృత్యముగూడఁ బ్రసక్తమైనది. ఈ యాందోళికా (ఆందోళనమన్నను ఆందోళికయన్నను నర్థమొక్కటే. (చూ.సూ.రా.ని) నృత్యముగూర్చి శ్రీ ముట్నూరి సంగమేశంగారిట్లు వ్రాయుచున్నారు. "కన్నడ యక్షగానాల్లో నటివేషాన్ని యక్షిణీవేషమని శ్రీ వేషమనీ, మోహినీవేషమనీ పరిపరి విధాల పిలుస్తారు. ఈమె మొదటిసారి రంగస్థలానికి వచ్చినపుడు నడుమువఱకు అట్టతో కట్టిన తొట్టెవంటి చౌకంలో నిల్చి నృత్తగతులు ప్రదర్శిస్తుంది. ఈ నృత్తాన్ని ఆందోళికా నృత్యమనీ, మంచె చప్పన నృత్యమనీ పిలుస్తారు. యక్ష గానములలో యక్షణీవేషముతో నొక రాందోళికా నృత్యమునెఱపుటజూడ యక్ష గానమునకును యక్షాందోళనమునకును ఏదో సంబంధముండి యుండుననిపించును. అనఁగా క్రీ.శ. 12వ శతాబ్దినాఁటికే యక్షగానమునకు నృత్యకళా సాహచర్యమును కలిగినదన్నమాట. ఎక్కలగానము నీయక్షాందోళనము నునవి రెండును, ఆటతోడిదే పాట పాటతోడిదేయాట అనునట్లెవరో యక్షగానవేషధారుల జాతీయ వృత్తి విద్యయొక్క కవలరూపులై యుండును. పాల్కురికి సోమనాథుని పండితారాధ్య చరిత్రలో యక్షాది నేపథ్యములతోపాటు పేర్కొనఁబడిన పాటయు, నాటయు, క్రీడాభిరామమునఁ బేర్కొనబడిన జక్కుల పురంధ్రి యక్షకన్యల యాటయు నీవిషయమును సమర్థింపఁ గలవు. పండితారాధ్యచరిత్ర వక్కణలో యక్షనేపథ్య సూచనయు, క్రీడాభిరామ జక్కుల పురంధ్రి పాటలో ఁబాటతోపాటుపకరణములు నామెగానముతోఁ గథాఖ్యానము చేసిన వైనము పేర్కొనబఁడుటయు, యక్షకన్యల నృత్యములో మతాశయి స్ఫురణమును విశేషములు.

యక్షగానముయొక్క ప్రాథమిక స్వరూప మాపేరే చాటు చున్నట్లుగానమై యుండుననుట నిర్వివాదము. అయితే పురాణ చరిత్ర ప్రసిద్ధులైన యక్ష జాతీయులెవ్వరికిని గానకళా ప్రతిష్ఠలున్నట్లు తగిన యాధారములు గానరానందున నెన్నఁడో యక్ష వేషధారణమొక వృత్తిగా నవలంబించినవారని యూహింపఁదగిన యెక్కల గాణల, జక్కుల పురంధ్రుల గానకళాభిమానములే యక్షగానోత్పత్తికి బీజాక్షర ప్రాయములైన వనియు, నా గానము నృత్త్యాత్మకముగాఁ గథాఖ్యానోపయోగిగా నృత్యానుకూలముగా నుండెడి యొక ప్రత్యేక శైలికిఁజెందియుండుట యక్షగానము యొక్క ప్రాథమికావస్థయై యుండుననియుఁ జెప్పవచ్చును.

పరిణామము :

యక్షగాన పరిణామ చరిత్రమతి చిత్రమైనది. రచనలోఁ బ్రదర్శనలోఁ దరతరమునకును పరిణామమందుచు వచ్చినది. మొదట యాత్రాస్థలములు, కామేశ్వరీవ్రత సంప్రదాయ పరాయణులైన కామందుల లోగిళ్ళును, తదుపరి పల్లెపట్టుల రచ్చసావడి, పాడి గలిగిన రాచ దేవిడీలను యక్షగానము ప్రదర్శనల కధిష్ఠానములైనవి. అది వివిధ ప్రదేశములకు విస్తరించుటవలన నాయా ప్రాంతములందలి వివిధ శ్రవ్య దృశ్యాత్మకములైన సాహిత్య ప్రక్రియలతో ననుబంధము పెంపొందించుకొన్నది. వివిధ గీతి ఛందస్సులను దనలో నిముడ్చు కొన్నది. యక్షగాన రచన గ్రామకరణములు, బొమ్మలాట రైతులు మొదలగు జానపదకవుల గంటములనుండి నగరములందు రాజాస్థానముల నాశ్రయించిన సంగీతకవులపైడి గంటములకును బ్రాకినది. కవిరాజుల గంటములే కాదు. రాజకవుల గంటములను యక్షగాన సరస్వతి కాశ్రయములైనవి. కలుకులముల పలుతరగతుల కవులకుఁ దద్రచనావకాశములు గలిగినట్లే జక్కులు, నెరుకులు, నేనాదులు, గొల్లలు, బ్రాహ్మణులు మొదలగు పలుతెగలవారికిఁ దత్ప్రదర్శనావకాశములు గలిగినవి. మొదట గానరూప కథాఖ్యానముగ గ్రామ సీమలఁ బామర గాత్రమాత్రోపజీవిగా నుండిన యక్షగానము నాడు నాటికి వాడవాడల నాడఁ బడుచుండిన వీథినాటకపు వాటమెరిగి రాచనగరి మొగసాలల కెగఁ బ్రాకి రంగభోగము నవధరించుటతో మార్గరూపక ప్రభావము

నభిసరిరించి నాటక నామకరణము చేయించు కొన్నది. కోటలోని రాజుగారికిని బేటలోని ప్రజలకును సమానముగా నాదర పాత్రమైనది. తెలుగు భాషకు బలుకుబడిగల పలుతావుల వెలసినది యక్షగానము. పలు తరగతుల ప్రజాజీవితోదంత విశేషములను ప్రతిబింబించుకొన్నది. పలువిధముల కథల కాశ్రయమైనది. పాఠ్యగేయ నాట్యాత్మకములైన పెక్కు ప్రయోజనములకిక్కువయై నిలిచినది. ఆదియొక సార్వజనీనమైన బహుముఖ ప్రయోజన సనాథమైన సాహిత్య ప్రక్రియగాఁ బరిణమించినది. ఈ పరిణామమంతయు నేఁడెనిమిది శతాబ్దుల చరిత్ర గలది.

యక్షగానము యొక్క ప్రాచీనత యెంతయో, ప్రాథమిక స్థితి యెట్టిదో మీదఁ పరిశీలింపఁబడినది. క్రీ॥శ॥ 12వ శతాబ్దికిముందు కాలము యక్షగాన చరిత్రలో నజ్ఞాతయుగము. అది యక్ష వేషధారణము వృత్తిగా నవలంబించి యుండుటచే నేర్పడియుండదగునని యూహింపదఁగిన ఎక్కలగాణల, జక్కుల జాతులు ప్రాదుర్భవస్థితి గర్భితమైన కాలమైయుండునని యూహింపవచ్చును. అనఁగా వారి మూలమున వాసికెక్కియుండునని యూహింపఁదగిన యక్షగానము ప్రారంభదశలోనే రూపారోపముగలదని చెప్పవలసివచ్చును. కాని యారూపారోప మా జాతుల యుత్పత్తికేగాని యక్షగాన రూపకళా పరిణతికి సద్యః కారణమైయుండునని చెప్పలేము. ఆ యక్షరూపారోపముతోని యాటపాటల ప్రసక్తి పాల్కురికి సోమనాథుని పండితారాధ్య చరిత్రలోగలఁదనఁగా నా సంప్రదాయము 14 శతాబ్దిదనుక వచ్చుచున్నట్లే చెప్పవచ్చును. కాని యిం దితివృత్తము మొదలగు విషయముల ప్రసక్తికానరానందున నాఁటి కది రూపకళా సమగ్ర స్వరూపమును నిరూపించుకొన్నట్లుకాదు. సాహిత్య ప్రక్రియగానైన రూపొందినట్లు గానరాదు. అట్లేయై యుండినచో వీరశైవమత ప్రవర్తకుఁడైన నద్విపద రగడోదాహరణాద్యనేక దేశిసాహిత్య ప్రక్రియల నతిప్రీతి నాదరించిన సోమన రగడ ద్విపదలకే ప్రాధాన్యముగల యక్షగానమును గూడ నొక్కటైన రచించి దానినొక ప్రచారసాధనముగా వినియోగించుకొని యుండడా? అసలు 15-16 శతాబ్దములకు ముందునాఁట యక్షగానమొక సాహిత్య ప్రక్రియగాఁగాని, రూపక ప్రక్రియగాఁగాని రూపొందినట్లాధారములు గానరావు. అయితే అంతకుముందు

మన యాంధ్రులకు మార్గనాటకమువంటి నాటకములు (క్రీడాభిరామము వినా) లేకపోవచ్చునుగాక. కాని యక్షగానమువలె దేశిసరణికిఁ జెందిన నాటకములు కొన్ని లేకపోలేదు. మనవలెనే పూర్వకాలమునఁ దమిళులు, కన్నడిగులు మొదలగు మరి కొందరికి మార్గనాటకముల వంటి నాటకములు లేనట్లు తెలియవచ్చుట యట్రము. కాని యాటవిక జాతులకే యాటపాటల యందాస్థ యున్నట్లు తెలియు చుండ నాగరక జాతులకు నాటక కళాభిరుచియన్నది సహజముగదా. ఆనాఁటి మనదేశి నాటకములే వీధి నాటకములను పేరం బ్రసిద్ధి కెక్కినవి. అట వీధిలో నాడబడు నాటకములని యర్థము. (వీధియనగా నిటదశరూపక ప్రబేధముగాదు. నాటకశబ్దమిట రూపక సామాన్యవాచి) ఇది కన్నడిగల 'బయలాట', తమిళుల 'తెరుక్కూత్తు' అనువానికి సమానార్థకమైనది. పాల్కురికి సోమనాథునిపండితారాధ్య చరిత్రలోనే నాటకములు, బహురూపకములు, వెడ్డంగము, తోలుబొమ్మలాటలు మొదలగు రూపక ప్రక్రియలనేకము పేర్కొనబడినవి. జవనికలు, పాత్రల యాహార్యకము, ప్రదర్శన ప్రరోచక, అభినయభంగులు, సంగీతపు హంగు మొ॥ నాటకపు తంతు వివరింపబడినది. త్రిపురవిజయము, కామదహనము, అర్థనారీశ్వరము, అంధక గంధగజాసురవధము, దక్షాధ్వరధ్వంసము, క్షీరసాగరము మధనము, సిరియాళ చరిత్ర మొ॥ నాటి నాటకేతి వృత్తములను బేర్కొనబడినవి. ఇందలి కథలు కొన్ని పిదప కాలమున యక్షగాన వస్తువులునైనవి. ఇవికాక క్రీడాభిరామమున బేర్కొనబడిన మాచల్దేవి చరితనాటకము, విజయనగర ప్రభువు వీరనరసింహరాయల (క్రీ. శ. 1506–1509) కొలువులోఁ గూచిపూడి బ్రాహ్మణ భాగవతులు ప్రదర్శించినట్లు తెలియ వచ్చిన సంబేట గురవరాజు నాటకము, క్రీ.శ. 1514 నాఁటి కర్నూలు జిల్లా చెరువు బెళగళ్ళ శిలాశాసనము నందుఁబేర్కొన బడిన తాముకొండ నాటకము మొ॥ యక్షగానములుగా నీనాఁడు కొందరు పరిశోధకులచే భావింపబడుచున్నవి. కాని యట్లు భావించుటకుఁ దగిన యాధారమేమియులేదు. అవి వీధి–తెర నాటకముల కోవకు జెందినవి మాత్రమేయై యుండును.

పూర్వము బహుధా సంస్కృత సాహిత్య ప్రవీణులైన మనకవులు సంస్కృత నాటకముల వంటి నాటకములను దెనుగున సృజింపరైరి సరికదా ఆ నాటకములనే నాటకములుగా నాంధ్రీకరింపలేదు. కొన్నిటిని పద్య ప్రబంధములుగా మాత్రమే పరివర్తించిరి. క్రీడాభిరామ మొక్కటి అందుల కపవాదము. అనాఁడు రాజాస్థానము లందు సంస్కృత నాటకములు బ్రదర్శింప బడుచుండెడివనియు, జనస్థానములలో వీధినాటకములు, బహురూపములు మొదలగు తెర నాటకములును బ్రచారము నందుండేననియు నూహింప వలసియున్నది. కాలక్రమమున వాని ప్రభావము యక్షగానములపై గూడబడి యదియాకృష్టులైన శిష్టకవులు కొందరు తద్రచన చేపట్టగనే రూపకకళ కొంత సంతరించుకొని యొక విశిష్టప్రక్రియగా రూపొంది రాజ ప్రమోదములను సమపాళముగా జూరగొని వీధి నాటకమనియు బేరొంది దేశి సరళికి జెందిన నాటకములకెల్ల బ్రతినిధిగా నిలిచినది. మనకు నాటక కృతులు లేనిలోటు తీర్చినది. దీని ప్రభావము మూలముగనే మొన్న మొన్నటిదనుక గూడ మన కవులకు మార్గ నాటకములవంటి నాటకములు రచింపవలసిన యావశ్యకత కన్పింపకపోయి యుండవచ్చును.

పాల్కురికి సోమనాథుని నాటికే యక్ష నేపథ్యముల తోడిపాటగా నాటగా వెలసియుండునని యూహింప దగిన యక్షగానమున కాంధ్రమున నాప్రదర్శకులొక విశిష్ట జాతిగా నేర్పడిన పిదప గొంతకాలమునకు యక్షనేపథ్యములతోడి సంబంధము సడలి గానమునకే ప్రాధాన్యము హెచ్చియుండును. పదునైదవ శతాబ్దిలో భీమఖండోదాహరణమును బట్టి యది స్తోత్ర పాఠోపయోగియైన యొక ప్రత్యేకగాన శైలి యనియు క్రీడాభిరామోదాహరణము బట్టి యది జక్కుల పురంధ్రిచే నెక్కటిగా శ్రుతిలయాత్మక వాద్యోపసహితముగా రాగతాళమానస్థాయి గమక నిహితముగా గాథాఖ్యాన పురస్సరముగా బ్రయోగింపబడు చుండెడిదనియు తెలియుచున్నది. ఉదా. క్రీడాభిరామమున నా జక్కుల పురంధ్రి పాటతో అక్కల ('యక్షకన్యల') యాటయు వర్ణితమైయుండుట (క్రీ.రా. 136-137) నా గానము నృత్యానుకూలమైనదనియుఁ దెలియనగును. ఇంకను నానాఁటి దాని ప్రత్యేకత యెట్టిదనగా క్రీ.శ. 1408-1502

సం॥ల నడుమనుండిన, సంకీర్తనాచార్యుడని ప్రఖ్యాతుడైన చినతిరుమలాచార్యుడు (1537 ప్రాంతము) సంకీర్తన లక్షణమగు సంస్కృత గ్రంథమును స్వపితామహ కృతమును స్వజనక వ్యాఖ్యాతమును (ఇది యలబ్ధము) దెనుగుజేయుచు దరువులు జక్కుల రేకు లేలలు, చందమామ పదములు మొదలగు వానిని మొదట బేర్కొనుచు బిదపగొన్నిటి లక్షణములు నిర్వచించి యక్షగాన పదముల గూర్చి యిట్లు వ్రాక్రుచ్చెను.

"యక్షగాన పదంబులు నవ్విధమున
సముచితానేక విధ తాళ సంగతులను
నవరసాలం క్రియా సవర్ణంబులనుచు
నలరునని హరికీర్తనా చార్యుడనియె"

-సం.ల. 66వ పద్యము

అతడు దరువులు, నేలలు మొదలగు పదములకు లక్షణమును చెప్పియుండెను. కాని వానితోపాటు మొదట జక్కుల రేకుల పేరెత్తుకొనియు (చూ. 50వ పద్యము) ప్రత్యేకముగా నా పేర లక్షణము చెప్పియుండలేదు.

అందుచేతను యక్షగాన పదముల నేలాదులతోపాటు మొదట బేర్కొనక పోయినను నేలాలక్షణమువెంట వాని లక్షణమును చెప్పి యుండుటను జూడ జక్కుల రేకులన్నను యక్షగాన పదములన్నను నొక్కటేయని నూహించవచ్చును. "యక్షగాన పదంబులు" అని బహువచనము వాడబడుటచే యక్షగానమనగా నేదోయొక్క గీతిచ్ఛందో ఘటితమైనదనికాక పలువిధములైన పదములతోకూడినదని తెలియనగును. అవి తాళ బహుళములను, నవరసాలంకృతములునై నవని స్పష్టముగా జెప్పబడినది. పై విషయములనుబట్టి 15వ శతాబ్దిలో యక్షగానము కథావలంబనము, సముచితానేక విధతాళ సంగతములు, నవరసాలంక్రియా సవర్ణములునగు పదములును కలిగి కావ్య రచనోపయుక్త స్వరూపమును కల్గియున్నదని చెప్పనగును.

రచనా ప్రక్రియను బట్టి సాహిత్యమంతయు మత్తైఅగులు- పద్యము, గద్యము, పదము - లేక గేయము. ఆ మూడింటి ప్రత్యేక ప్రయోగమువలనగాని సంకలన ప్రయోగమువలనగాని బహువిధ సాహిత్య ప్రక్రియలను సాధింపవచ్చును. తెలుగులో

బదునాఅవ శతాబ్ది చివరిదాకా వెలసిన శిష్టవాఙ్మయ మెక్కువగా బద్యగద్య ఉభయాత్మకమైన చంపూధోరణిలో సాగిన పూరాణములు, ప్రబంధములు, పద్య కేవలముగా నడచిన శతకములే. కాని అప్పటికే చాల కాలముగానే పల్లెయెల్లలలోనో పలుకుచున్న గేయ సరస్వతి శిష్టకవులచే నుపేక్షింపబడినది. అయినను నిష్టపడిన శిష్టకవులే కొందఱు పద పద్యములకు నడిమి వాటముగా నడచునట్టి ప్రక్రియ నొకదానిని స్వీకరించిరి. అదే ద్విపద. అట్లే యటు మార్గపద్ధతికి చెందిన కళికోత్కళికల రూపమున నవతరించిన పదకవితా ప్రభేదమగు రగడయు గలిసి వచ్చిన ఉదాహరణమును గూడ స్వీకరించిరి. ఆ ప్రక్రియలన్నింటికి నేకవాక్యత సంఘటింప గలట్టిది యక్షగానము. ఆ రహస్యము గ్రహించియే కాబోలు కాల క్రమమున వైవిధ్య ప్రవీణులైన మన కవులు కొందఱు తద్రచన చేపట్టిరి.

మనకిప్పటికి తెలిసినంతలో తెలుగున వెలసిన మొట్టమొదటి యక్షగాన రచన క్రీ॥శ॥ 15వ శతాబ్ది యుత్త రార్ధముననుండిన ప్రోలుగంటి చెన్న శౌరి శౌభరిచరితమే. అదియైన నతడు రచించినట్లు తెలిసినదే కాని గ్రంథము లభింపలేదు. అది జక్కుల కథయని పేర్కొన బడినది. అది తాళ్ళపాక చినతిరుమలాచార్యుడు చెప్పిన యక్షగాన లక్షణమట్లు "నవరసాలంకృతమగ" నున్నదని పేర్కొనబడుట గమనింప దగియున్నది. కవి దానిని జక్కుల కొఱకు వ్రాసెనో, జక్కులవారి గానరూపకధాఖ్యాన ఫక్కినే మూదలగా రచించి యుండుటచేత నాపేరు పెట్టియుండెనో, లేక యానాడు యక్షగాన సామాన్యముగా జక్కుల కథయను పర్యాయ వ్యవహారమున్నదో తెలియదు. సౌభరి చరితము భాగవత విష్ణు పురాణములందుగలదు కాని దానికి యక్ష పాత్రలతోగాని జక్కుల కులదేవతయగు కామేశ్వరితోగాని సంబంధములేదు. మనకీనాడుపలబ్ధమగు యక్ష గానములన్నియున్నట్టివే. చెన్న శౌరి కృతి యక్షగాన మని యూహించుటయే సమంజసమగును. 15వ శతాబ్దినాటి యక్షగాన రచన తీరెట్టిదో చూతమన్న నాకృతియు కృతిమాసిపోయినది క్రీ.శ. 1500 సం॥ ప్రాంతమువాడగు వెల్లంకి తాతంభట్టు తన కవి చింతామణియను లక్షణ గ్రంథమున భాషా లక్షణాధికారమున "లక్ష్మీ కళ్యాణములోని రేకు"లను "నీరజోదరు రాణి నీలవేణికిని" అను నుదాహరణమిచ్చెను.

రేకులను రచనా విశేషము యక్షగానములందు మాత్రమే కన్పట్టును. యక్షగాన పదములకు జక్కుల రేకులకు పేరున్నట్లు సంకీర్తన లక్షణమునుండి గ్రహింపనగును గదా. అయితే తాతంభట్టు నుదాహరణము ద్విపద పాదము కాని యిది జంపెగతి గలది. ఆ ప్రక్కనున్న రేకను మాట కాదనరానిది. ఇది చిత్రకవి పెద్దన యక్షగానము లందుండునని చెప్పిన "జంపెరేకు" లక్షణమునకు సన్నిహితముగా నున్నది. పై లక్ష్మీ కల్యాణము యక్షగానమై యుండునని తలంపనగును. కాని యీ గ్రంథము కూడ లభింపలేదు. ఇది యత్కృతమను విషయము గూడ తెలిసినదికాదు. దీనిని బట్టి నాటి యక్షగానములందు రేకనునది యొక రచనాంగమని యూహింప నగును. దాని స్వరూపమెట్టిదో యెఱుగుట కాంధ్రమున యక్షగాన లక్షణముగూర్చి చెప్పుటకు గొంత ప్రయత్నము చేసిన వారిలో మొదటివాడగు చిత్రకవి పెద్దన (16వ శతాబ్ది పూర్వార్థము) రచించిన లక్షణసార సంగ్రహమును పలుకరింపవలెను. అతడు నవవిధ రగడల లక్షణములను చెప్పి వెనువెంట యక్షగానముగూర్చి యిట్లెత్తుకొనినాడు:-

॥సీ॥ "వృషభగతి త్రిపుదరే కంఘ్రియుగముగుఁ
దుదనేడు లఘువులు తొలగజేయు
జంపె రేకునకు లక్షణము ద్విరదగతి
యగుగొన నొక లఘువందుమాన
రచ్చరేకగును దురగవల్గనముగతి
మరి యేకతాళి యౌ మధురగతిని
అట తాళమున మాత్ర లంఘ్రికిర్వది నాల్గు
నాల్గిట విరతి పధ్నాలుగింట

॥తే॥ నిలుచు నర్థంపు నర్థచంద్రికలు దీన
యక్షగానాది కృతులలో నార్యులిడిన
రగడ భేదంబు లివి యౌను రమ్యచర్య
యవిత నిజదాస సముదాయ! యాంజనేయ"

ల.సా. సం. 11-141.

ఇందు పేర్కొనబడిన త్రిపుటాదులు సంగీత ప్రపంచమున సూళాదితాళములుగా బ్రసిద్ధములు. మఱి "త్రిపుట రేకు" "జంపెరేకు" అనగా నవి తత్తత్తాళ ప్రధానములగు గీతములందేకైక చరణములు లేక దళములను విభాగముల వంటివైయుండును. అందలి యర్థము లర్థ చంద్రికలు. "యక్షగానాది కృతులలో నార్యులిడిన రగడ భేదంబులివి" రగడ భేదములు కాని రచనా విశేషము లింక నెన్నిగలవో యానాటి యక్షగానములందదీ యెఱుగరాదు.

క్రీ.శ. 1450-1550 సం॥ల నడుమ యక్షగాన లక్ష్యలక్ష ణములిట్లు లాక్షణిక పరిగణనమున కెక్కినవనగా నాప్రాంతమున యక్షగాన రచన కొంత సాగినదనియే చెప్పవచ్చును.

ఈనాడు దొరికేవానిలో కవి కాలం తేలినంతలో కందుకూరు రుద్రకవి సుగ్రీవ విజయమే ప్రాచీన తమమైనదిగా పరిగణింపబడు తోంది. అతడు పెద్దనకు ఒక్కింత అర్వాచీనుడు. అయితే చక్రపురి రాఘవార్యుని విప్రనారాయణ చరిత్రమనే యక్షగానాన్ని పెద్దనకు సమకాలీనమైన దానిగా అంటే ఇప్పటికి మనకు లభ్యమయ్యే వానిలో మొదటిదానిగా నేను గుర్తించి నాపరిశోధన నిబంధనలో దానిని గూర్చి వ్రాసియున్నాను. ఇదీ సుగ్రీవ విజయము. రెండును కవులచే యక్షగానాలుగా పేర్కొనబడినవే. రెండింటిలోను రచనా సామ్యము స్పష్టముగా గుర్తించవచ్చును. రెండింటిలోను ఎత్తుగడ అర్ధచంద్రికలలో దశావతార ప్రశంసాత్మకముగనే షష్ఠ్యంతాలు, గ్రంథాంతమున కర్తృత్వ ద్విపద, రచనలో ద్విపదకు జంపె, త్రిపుట మొ॥ తాళ ప్రధానమైన రేకులకు ప్రాచుర్యము, యెడనెడ సంధి ప్రయోజనాత్మకాలయిన చిన్న చిన్న వచనాలు, ఏలలు, అర్ధచంద్రికలు మొ॥ దేశీయ మధుర కవితా ఛందో విశేషములు, అతివిరళంగా పద్యములు ఉండుట చూడగా అదియే ప్రాచీన యక్షగాన రచనా పక్కియిన యనిపిస్తుంది. చిత్రకవి పెద్దన యక్షగానాల్లో ఉపయోగింపడు రగడ భేదాలను ఉదాహరిస్తూ ఏ రగడకు ఏ తాళము సరిపడునో అంతమాత్రమే చెప్పియున్నాడు. ఆంధ్రదేశంలో యక్షగాన రచన యించుమించు రెండు శతాబ్దముల కాలము ఆ ప్రాచీన ఫక్కిలోనే సాగినది, మధ్య మధ్య కంకంటి పాపరాజువంటి

విదగ్ధులు కొందఱు మఱికొన్ని వేషాలు చేరుస్తూ వచ్చిరి. 1650 ప్రాంతపు అప్పకవి స్వయముగా యక్షగాన రచన చేసినవాడైనప్పటికిని దాని లక్షణ విషయమున మాత్రము పెద్దన నుడివిన విషయమునే పునశ్చరణ చేసెను. ఆ లక్షణం పరిపూర్ణమైనది కాకపోయినా వారిరువురు యక్షగాన రచనాంగములలో ముఖ్యమైన దానినిగూర్చి మాత్రమే చెప్పదలచినట్లు తోస్తుంది. అదే తాళము ప్రధానమైనరేకు. దాని మూల ప్రకృతి రగడ. దరువు అన్నది సంస్కృతి "ధువా" శబ్దభావమై ఉండనోపును. నాట్యములోవలె యక్షగానములలోను యిది అనేక ప్రయోజనాలకు ఉపయోగ పడుచున్నది. ఇది రాను రాను కర్ణాటక హిందూస్థానీ సంగీత పద్ధతులకు ప్రచారము కలిగిన రోజులలో కవుల నేర్పుకొలది రగడ వికృతి విడనాడి రాగ ప్రాధాన్యము వహించినది. అప్పకవి తర్వాత యక్షగానపు టూనుఎత్తుకొన్న లాక్షణికులు ఒకరిద్దరు లేకపోలేదు. కాని ఎవరు చెప్పినా ఆ లక్షణానికి అవ్యాప్తి పడుతూనే వచ్చినది. అసలు ఎలాంటి ఛందోబంధమునైనా తనలో ఇముడ్చుకోకలిగినటువంటిది యక్షగానము. కాలము గడచిన కొలది దేశములో నాట్య సంగీతములకేర్పడిన వికాస వ్యాప్తులను బట్టి, ప్రయోక్తల అవకాశములనుబట్టి యక్షగానము అనేక వాలకములు వేసినది.

సుగ్రీవ విజయాన్ని పరిశీలిస్తే అది ప్రదర్శన సౌలభ్యముగల రచనయే అనిపించును. ఆనాడు యక్షగానములు ఏ విధముగా ప్రదర్శింపబడినవోగాని, అప్పటికే వీధినాటకాది ప్రదర్శనములలో ప్రతిష్ఠలనందుకొన్న భరతవిద్యా దురంధరులైన కూచిపూడి భాగవతుల వలన పిదప కాలములోనే యక్షగాన ప్రదర్శనలకు ఒక నూతన చైతన్యము ప్రచారము కలిగినట్లు చెప్పవచ్చును. 17వ శతాబ్ది ఉత్తరార్ధములో వారి కులపతి శ్రీ సిద్ధేంద్రయోగియొక్క అపూర్వ సృష్టియైన కలాప ప్రదర్శన ప్రక్రియలో నృత్యప్రధానమైనది. కాని దాని రచనా ప్రక్రియకు యక్షగానమే మూదల కావచ్చును. ఆ కలాప ప్రభావము అర్వాచీన యక్షగానముల మీద పడినది. కూచిపూడి భాగవతులు తెలుగు నేల నాలుగు చెరగులను తిరుగుదురు. వారి ప్రదర్శనలు కారణముగా ఆయా గ్రామములందు మొలిచిన యక్షగాన

మేళములవారు కూచిపూడి కత్తును ఎవరికి చేతనై నంత వారు అనుకరింపసాగిరి. ఏనాదులు, గొల్లలుకూడ యక్షగాన ప్రదర్శనలకు పూనుకొనిరి.

యక్షగానము ప్రదర్శనల కెక్కిన తరువాత కూడ చాలకాలము దనుక దాని ఆద్య ప్రకృతియైన శ్రవ్య ప్రయోజనము కూడ ప్రక్క ప్రక్కల సాగుతూనే వచ్చినది. 19వ శతాబ్ది ఆంధ్ర దేశంలో యక్షగానము ఎక్కువగా పరిణతి చెందిన కాలము. యక్షగానములు కోకొల్లలుగా వెలిసినవి. ఇంచు మించు అన్ని నాటక నామముతో ప్రదర్శనలకు ఎక్కినవే. దేశములో పలుతావుల యక్షగాన మేళములు కూడ వెలిసినవి. యక్షగాన రచనలో ప్రదర్శనలో స్త్రీలును పాల్గొన జొచ్చిరి. బొమ్మ లాటలకు పనికివచ్చునట్లు యక్షగానములు రచింపబడినవి. కొందఱు హరిదాసులు తమ హరికథలను యక్షగానములని వ్యవహరింపసాగిరి. క్రమేపి యక్షగానము మీద సంస్కృత రూపక ప్రభావము ఆధునిక రంగస్థల నాటక ప్రభావము పడసాగెను.

ఆంధ్రదేశములో యక్షగాన రంగ విషయములో మాత్రము అభివృద్ధి కనుపట్టదు. అప్పటికప్పుడు ఏయూరిమొగనో ఏ దేవాలయము ముంగిటనో తటా తుటంగా నిర్మింపబడిన పందిరి క్రింద కటిక నేలయే రంగస్థలము. చుట్టూ కనుచూపుమేర అంతి ప్రేక్షాగారమే. కూచిపూడి భాగవతులు భరత విద్యాదురంధరు లైనను ఊరూర సంచారము చేయువారు అగుటచే రంగస్థల విషయమున వారు శ్రద్ధవహించలేదు. అటు యిటు చెరి యొకనిచే పట్టుకొనబడిన తెల్లని గుడ్డయే తెర. తెరకటు నిటు నూనె దివిటీలువుండును. తెరవెనుక హంగుదారులు వంత పాటకులు ఉందురు. హంగు – తిత్తి – మద్దెల, తాళపు చిప్పలు; తెర ముందు సూత్రధారుడు కన్పట్టును. అతడే ప్రదర్శన ప్రవర్తకుడు. ఆ పాత్రల ఆహార్య విషయములో కూచిపూడి వారి గడియాలు, సరంజామా పేరుపడినవి. ఆంధ్రప్రదేశములో వారి ప్రదర్శన పద్ధతులే ఆదర్శ ప్రాయములైనా ఆ పద్ధతుల లగువు బిగువులు కడమ చోట్ల కానరావు. ఈనాడు ఆంధ్రదేశములో కుచ్ కుచ్‌గా కూచిపూడి వారివి తప్ప ఇతరత్రా యక్షగాన ప్రదర్శన ప్రతిష్ఠలు అడుగంటినవనే చెప్పవలసి యున్నది.

దక్షిణ దేశములో మొదట తంజావూరునందు యక్షగానమునకు రాజభోగము పట్టినది. నాడు యక్షగానానికి నాటక నామము ధ్రువపడినది. నాటి కవులనేకులు అలాటి రచనలు చాల సాగించినారు. అవి కొలువు నట్టువ మేళముల వారిచేత ప్రదర్శింబడెడివి. అందులో పద్యముల కంటే గద్యమునకే ప్రాధాన్యము పెరిగినది. ప్రాచీన మధుర కవితారీతుల ప్రాచుర్యము తగ్గి పదకవితలు కర్ణాటక సంగీత ఫక్కికలు ఎక్కువగా చోటు చేసికొనెను. సంధి వచనముల సంఖ్య తగ్గి పాత్రల సంవాద వచనముల సంఖ్య బెరుగ జొచ్చెను. అక్కడక్కడ రంగ ప్రయోగ సూచనలు కూడ నుండెను. మార్గ రూపక మర్యాదలు కూడ ఆదరింపబడినవి. తాత్కాలిక విషయములను ఇతివృత్తములైనవి. నాటి రాజాస్థానముల వైభవములు. ప్రజాజీవిత విశేషములు కూడ ముమ్మరముగా చిత్రింపబడినవి. తదుపరి తంజావూరు ప్రభువులైన మహారాష్ట్రులు కూడ మన తెలుగు యక్షగాన రచనా ప్రదర్శనముల యెడ అధికారము జూపి ఉండుట ముదావహము. శహాజీ ప్రభువొక్కడే (1684–1712) ఇరువది గ్రంథములకు కర్త. అతని అస్థానాంధ్ర యక్షగాన కవులలో దర్భా గిరిరాజగ్రేసరుడు. అతడు ఆరు యక్షగాన ప్రాయ రచనలు చేసెను. అందు ఒకటి రాజమోహన కురవంజి. కురవంజి తమిళ శబ్దము. అనగా కొరవ జాతి స్త్రీ యని యర్థము. అనగా ఎరుకత. తత్పాత్ర విశిష్టములైన యక్షగానములకే అది ఒక నామాంతరముగా కనిపించుచున్నది.

శహాజీ నాటి నుండి చిట్టచివర శివాజీ (1685–1855) వఱకు తంజావూరు మండలము, తత్పరిసరములలో యక్షగాన నాటక రచన ప్రదర్శనములు బాగుగా సాగినవి. సంస్కృతి రూపక ప్రభావము యినుమడించి యక్షగానము ఉత్పత్తిలో దేశియైనను పరిణామములో మార్గియైనదని చెప్పవలయును. నాడు యక్షగాన కవులకును, కృతులకును రాజాశ్రయము రంగభోగము విస్తరించినవి. రాజాశ్రితులు కాని యక్షగాన కవులలో ముఖ్యులు నారాయణతీర్థులు, త్యాగయ్య, మేళత్తూరు వెంకటరామశాస్త్రి, సుప్రసిద్ధమైన మేళత్తూరు భాగవతమేళ నాటక సంప్రదాయమునకు అద్య ప్రవర్తకుడు వెంకటరామశాస్త్రియే.

18వ శతాబ్దిలో మధుర పుదుక్కోట మైసూరు రాజాస్థానములలోను కడమ కన్నడ తమిళ ప్రాంతములందును తెలుగు యక్షగానములు కొన్ని వెలసినవి. తమిళ కన్నడ యక్షగాన రచనలకు మార్గదర్శకాలైనవి.

తెలంగాణములో యక్షగానములు శతాధికములు కనబడుచున్నవి. రచన 18వ శతాబ్దము నుండియే విరళముగా ప్రారంభమైనది. అవి మొదట ప్రదర్శనలో కంటె పారాయణమునందే ఎక్కువ ప్రచారమును పొందెను. 1780 నాటి శేషాచలపు ధర్మపురి రామాయణము 1834 నాటి ముద్దయ కవి మంథెన రామాయణము మొ॥ 19 శ. నుండి ప్రదర్శన కనువైన రచనలు ప్రారంభమైనవి. గోవర్ధనం నరసింహాచార్యులు, శేషభట్టరు కృష్ణమాచార్యులు, వట్టెము పాపకవి మొ॥ పండిత కవులు కూడ యక్షగాన రచన చేపట్టిరి. ఆత్మకూరు సంస్థానాధీశుల ప్రాపుల యక్షగానమునకు రాజాశ్రయము లభించినది. ఒక గొల్లకలాపము, ఒక కురవంజి (రూఫ్‌ఖాను పేటరత్తమ్మ గారిది) కూడ వెలిసినవి. ఈ శతాబ్దిలో ఇప్పటి తెలంగాణాలో యక్షగాన రచన ప్రదర్శనములు సజీవములై ఉన్నవి. అందులో రచనా పాటవము ప్రాచీన ఫక్కి తక్కువై, నాటకీయత వస్తువైవిధ్యము ఎక్కువై ప్రజామోదాన్ని బాగుగా జూరగొనినవి.

యక్షగాన ప్రయోగము :

యక్షగాన రచనా ప్రక్రియ పరిణామ చరిత్రను గూర్చిన ముందటి ప్రకరణమున బ్రసక్తాను ప్రసక్తముగ యక్షగాన ప్రయోగమును గూర్చియు గొన్ని విశేషములు తెలుపబడినవి. ప్రయోగ సూచనలు, ప్రయోగానుకూల ప్రక్రియయు గలకొన్ని య.గా.ల యుదంత ముదాహరింపబడినది. ఈ విషయమై ద్వితీయ భాగమున నేయే గ్రంథముల యందే యే విశేషములు గలవో తగు సూచన చేయబడినది. యక్షగానము మన దేశినాటక కోశమంతటికిని ప్రాతినిధ్యము వహించిన విశిష్ట ప్రక్రియ కావున దాని ప్రయోగ ఫక్కికను గూర్చి ప్రత్యేకముగ నీ ప్రకరణమునకు బ్రసక్తికల్గినది.

యక్షగాన ప్రయోగము యొక్క ప్రాథమిక స్వరూపము గానరూప కథాఖ్యాన మను విషయము పూర్వోక్తము. ఆ పద్ధతి యొకవంక నప్పటప్పట సాగుచునే వచ్చినదని యూహింప నవకాశము కలదు. ఇందుల కుపబలకముగా తంజావూరు విజయ రాఘవ నాయకాస్థానకవియైన చెంగల్వ కాళకవి తన రాజగోపాల విలాసమున యక్షగానము నంతగా ప్రవర్తితమగు సంగీత గోష్ఠిగా సూచించిన వైనము, కన్నడ దేశమున నీనాడు యక్షగానము 'తాళమద్దల' యను పేరుతో హరికథవలె వాఖ్యానింపబడుటయు గలదను విషయము, మన హరిదాసులను తమ హరికథలను యక్షగానములని పేర్కొనిన విషయమును బూర్వోక్తములే. అది యొక పదకేళికగా బ్రదర్శింపబడు చుండిన దనుటకాధారములును (పరమానంద యతి, కంఠీరవ రాజుల రచనలు) బొమ్మలాటకు వెనుకపాటగా నుపయోగింపబడుచుండిన (ఇందులకు 19. శ. యక్షగానముల గురించియే తగిన యాధారము గలదు) దను విషయమును బూర్వోక్తమే. అది యెప్పటి నుండి యెట్లొక రూపక ప్రక్రియగా బరిణమించినది వివిధ దశలలో వివిధ ప్రదేశములలో దాని ప్రయోగము తీరెట్టిది అను విషయము గొంత పూర్వోక్తమయైనను బ్రత్యేకముగనే తత్ప్రకరణోచితముగ విపులీకృతమై యిట బునశ్చరణ మొనర్పబడుచున్నది.

క్రీ.శ. 16వ శతాబ్దము నుండి ఆంధ్రదేశమున యక్షగాన రచన మెక్కువగా సాగుచుండినది. అప్పటికే దోరసముద్రపు నటులు, కూచిపూడి భాగవతులు, జంగాలు మొ॥ వారు వివిధములగు వీధి నాటకములు, తెరనాటకములు నూరూర ప్రదర్శించుటలో బ్రసిద్ధులై యుండిరి. అట్లు దేశి నాటక కళకు విశేష ప్రచారము కలిగిన యా దినములలో వెలసిన యక్షగానము లందును నాటకోచితమైన రచన సాగినది. అందుల కానాటి సుగ్రీవ విజయాదులే తార్కాణలు. సుగ్రీవ విజయ మానాడు ప్రదర్శితమై యుండుననియే డా. నేలటూరి వెంకటరమణయ్యగారు మొ॥ పండితుల తలంపు. 'ఆ యా పాత్రముల పాటల తత్తద్వేషధారులువచ్చి పాడునట్లును తక్కిన సంధి వచనాదులు ఒకరిద్దరు సూత్రధార ప్రాయులు పఠించునట్లును సుగ్రీవ విజయము వీధి యాటగా నాడబడుచుండెడి' దని కీ.శే. వేటూరి వారి వక్కణ.

17వ శ.ఉ.భా. ఆంధ్రదేశమున యక్షగానమునకు కూచిపూడి వారి కలాపముతో సంపర్కము కలిగినది. ఆ కలాప మాత్మాశ్రయ ఫక్కికము; నృత్య ప్రధానమునగు నొక యుపరూపక ప్రాయమైన దృశ్యప్రక్రియ. నాటినుండి యట్టి ప్రక్రియతో యక్షగానములు ననేకము వెలసినవి. పారిజాతములను పేరవెలసిన వందులకు బరమోదాహరణములు.

18వ శతాబ్ది యందాంధ్రదేశ యక్షగానములు కొన్నిటిపై మార్గనాటక ప్రభావము కొంత పొడసూపినది. అది 19 వ శ.ఉ. భా. న జిక్క పడినది. అది యట్లు చిక్కపడనున్న కాలముననే దానిపై నాధునిక రంగస్థల నాటక ప్రభావము కూడ పడి యక్షగాన మందు నాటకీయత యినుమడించినది.

ఆంధ్రదేశమున యక్షగాన రంగ విషయమున తగిన యభివృద్ధి కన్పట్టదు. అప్పటికప్పుడే యూరి మొగనో యే కోవెల మొగిలి వాకిటనో, యే సంపన్న గృహస్థునింటి ముంగిటనో తాటా తూటముగా నిర్మింపబడిన కమ్మల పందిరిక్రింద గళ్ళాపు జల్లిన కటిక నేలయే దాని రంగస్థలం. కేవలం మారుబయట గాక పందిరి క్రింద ప్రదర్శింప బడుటయే దాని యభివృద్ధి. దాని చుట్టును కనుచూపు మేర నంతయు బ్రేక్షకాగారమే. అటునిటు చెరియొకరిచేతబట్టుకొని తెరవెనుక హంగుదారులు, తిత్తి, మద్దెల, తాళపు జిప్పల వారును, వంతపాటకులు సుందురు. తెర ముందొక దతడే సూత్రధారుడై ప్రదర్శనారంభము నందు ప్రార్థనాదికము పచరించుట, కథాసందర్భము వివరించుట, పాత్రలకు వంతపాటకులకు పాటల మొదటి ముక్కలందించుట, పాత్రల అభినయమున కనుకూలముగ తాళమువేయుట నడుమ సంధి వచనములను, వస్తుగతవర్ణ నాత్మక ద్విపదలను చదువుట మొదలగు పనులొనర్చును. ఒక్కొక్కప్పుడు హాస్యగాడని యొకడు సహాయకుడుగా నుండును. వంతపాటకులు పాత్రలతోపాటు పాడుదురు భామాకలాపము 'బాణీ'కి ప్రచారము కల్గిన నాటినుండి యక్షగామున సాధారణముగా బాత్రలు తెరలో నుండియే తమ యుదంతము తామే (ప్రదర్శక ప్రముఖుని పృచ్ఛలపై) చెప్పుకొని (ఈ పద్ధతి సామాన్యజనుల బోధశాలిత కనుగుణముగా కల్పితమై యుండును) గుగ్గిలము

ప్రోక్షణతో భగ్గుమను దివిటీల వెలుగు చూపర కనులు మిరుమిట్లు గొల్పగా, సూత్రధారునివెంట వంతపాటకులందుకొను ద్రుతగతి ప్రావేశిక ధ్రువతో, హంగుదారుల తాళ మృదంగాదుల హడావుడితో తమ కాలిగజ్జెల గలగలలతో బయల్వెడలి యా యా మేళము సంప్రదాయమును బట్టి సభా సమస్కార సూచనముగా సాభినయముగా నమ్రశిరస్కతయో, కరముకుళనమో, పుష్పాంజలి సమర్పణమో, కావించి కథా ప్రవర్తనలో పాల్గొనుట పరిపాటి. కూచిపూడివారి భామావేష మెంతకు గాని తెర బయల్పడదు. ఆ సందర్భమున జడవర్ణన యొకటి మిగుల విశిష్ఠమైనది. అది యొక ప్రబంధమే. 'వేణీప్రబంధము' భామవేషగాడట్లు తెరపై జడవైచుట భరతమునందు తనకు సాటివారు లేరని పందెము చరచుటయట! యక్షగానములలో తెర, ప్రక్కవాటుగాగాకపైనుండి క్రిందు వాటముగా తొలగింపబడును. తెర తొలుగునంత హంగుదారులును రంగముపై బాత్రపార్శ్వముల నుందురు. సాధారణముగా యక్షగాన ప్రదర్శనలలో పాత్ర నిష్క్రమణము మాత్రము ప్రత్యేకముగా సూచింపబడదు. తన ప్రయోజన భాగ (portion)పై పోవునంత నా పాత్ర తెనుకకు జరిగి వంతపాటకుల నడుమనిలబడును. అట్టిచో నా పాత్రలు వంతలో పాల్గొనుటయు కద్దు. ప్రదర్శన సుమారు జాము రాత్రికి ప్రారంభమై తెల్లవారులు సాగును. తెల్లవారుసరికెట్లో ప్రదర్శనమలు తెమల్చుకొని మంగళము పాడి మేళము వారా వాలకములతోనే యూరి పెద్దల యింటింటికేగి వారిలోగిళ్ల మరలనేదో పదాభినయము పట్టి యధోచితసత్కారములంది పోవుదురు. ఆంధ్రదేశ యక్షగాన ప్రదర్శకులకివి సామాన్య లక్షణములు. ఒక్కొక్కచో నాయా ప్రదేశములందలి ప్రదర్శకుల కౌశలమును బట్టియు నవకాశములను బట్టియు నభిరుచి భేదమును బట్టియు గొన్ని కొన్ని విశేషములు విపర్యాసములు నుండవచ్చును.

ఇక్కడ నాంధ్రదేశ యక్షగానములందు స్త్రీ పాత్ర నిర్వహణము గూర్చి యొకమాట చెప్పవలసియున్నది. 16వ శ. మొదట తప్పిదారియొక్క తాయికొండ నాటకమున మాత్రము స్త్రీ పాత్ర నొక స్త్రీయే నిర్వహించినట్లు తెలియుచున్నది. కాని 18వ శ. చివరి దనుక స్త్రీ పాత్రలను పురుషులే నిర్వహించినట్లు తెలియనగును. ఆ

తాయికొండ నాటకమైనను యక్షగానమని యూహింపనవకాశము గానవాడు. అదియొక వీధి నాటకమైయుండును. పోని, నాటి వీధి నాటకములందయిన నన్నిట స్త్రీలు పాల్గొనుచుండిరా యనగా నట్లు గాదు. ఆ నాడే కూచిపూడి భాగవతులు వీర నరసింహరాయల యెదుట ప్రదర్శించిన నాటకములలో బురుషుడే స్త్రీ పాత్ర ధరించినట్లు స్పష్టముగా గలదు. వారు గరితల కభినయ విద్య గరపుదురు. కాని గణికలనైనను తమ నాటకములలో బాల్గొననీయరు. అది కూచిపూడి భాగవతుల ముఖ్య సమయములలో నొకటి. వారి 'భామవేషగాడు' అనుమాటనొకటి తెనుగు దేశమున దరుచు వినిపించు చుండును. భామ వేషమనగా భామా శిరోమణియైన సత్యభామ వేషము, ఆ వేషమే పురుషులచే నిర్వహింపబడినపుడు కడమ స్త్రీ వేషములమాట తడవంబనిలేదు. యక్షగానోపస్థితికి జక్కులపురంధ్రుల యాటపాటలే కారణములైనను యక్షగానము కూచిపూడి భాగవతులు వీధి నాటక ప్రదర్శకుల దృష్టినాకర్షించి యొక రూపక ప్రక్రియగా బరిణమించినంతట దాని జక్కుల జాతి తోడనే సంబంధము పోయినట్లుతోచును. కూచిపూడివారి యాలంబము గల్గినంతట వారి యాచారముద్ర దానిపై హత్తుకొని యిదియే తదితర ప్రదర్శకులకు నాదర్శప్రాయ మగుచు వచ్చినది కొంత కాలము. 18వ శ. నడుమ కూచిమంచి జగ్గకవి చంద్రరేఖా విలాపమున "అదు భాగవతుని జాడగడ్డము మూతి నున్నగా గొరిగించుకొన్నవాడు" అని యన్నమాటను బట్టియు నా కాలమునే తురగా రామకవి యొక చాటువులో భాగోతుల బుచ్చిగానిని స్త్రీపాత్ర ధారిగా బేర్కొనుట బట్టియు నప్పటికి బురుషులే స్త్రీ పాత్రధారణము సేయుచుండినట్లు తెలియనగును. కాని 18 - 19 శతాబ్దుల సంధికాలమున వెలసినట్లూ హింపదగిన పురిజాల లక్ష్మీనారాయణ కవి పారిజాత య.గా.న సఖిపాత్ర భాగవతములందు బురుషులు స్త్రీ పాత్రధారణ సేయుటుచితము గాదని వాదించుటయు సత్యభామ ప్రత్యాఖ్యానము జేయుటయు జూడ నా కవి కాలమున నక్కడక్కడ స్త్రీలును య.గా.న ప్రదర్శనములందు బాల్గొనుటకు బూనుచుండిరనియో లేక స్త్రీ పాత్రలు స్త్రీలే నిర్వహించుటుచితమను వాదము బయలుదేరి యుండననియో యూహింపనగును. 19 శ. నుండి యిటనట స్త్రీలును

ప్రదర్శనములలో పాల్గొనుచుండిరనుటకు దగిన యాధారములు గన్నట్టుచున్నవి. విశాఖపట్టణము జిల్లా వృత్తాంత సంగ్రహము (పుట130)లో "జన రంజక నాటకములు స్త్రీలు పురుషులు వేషములు వేసికొని వినికి చేసెడివారు" అని యున్నది. 19శ. ఉ. భా.న నెల్లూరు మండలము ఆత్మకూరు తాలూకా పడకండ్ల గ్రామ కరణమగు పడకండ్ల స్వామి రాయకవి నట మేళములను రప్పించి నెలల తరబడి వారికి వాసగ్రాసములు గల్పించి, గణియములు, వస్త్రములు ప్రదర్శన శిక్షణయునిచ్చి తను రచించిన లక్షణా పరిణయాది యక్షగానములను ప్రదర్శింపజేసెడి వాడనియు నా మేళములో "గొనుదిన్నె బుగ్గసాని (లక్షణ) మాటగా తా లక్షణా పరిణయ గ్రంథమందే యున్నది. ఇట్టి సందర్భములను బట్టి రానురాను యక్షగాన ప్రదర్శనములందు గొన్ని గొన్ని చోటుల వారికిని బాల్గొనుట కవకాశము గల్గినదని చెప్పనగును.

ఇక నీ యక్షగాన ప్రదర్శన ప్రక్రియ యందలి మౌలికమైన తత్త్వము యొక్క లక్షణము లెట్టివనగా...

1. ఇందు రూపారోపము(పాత్రానుకూల వేషధారణము) గలదు. కావున నిదిరూపక సమాఖ్యకు దగియున్నది. ("రూపారో పాద్రూపకమ్").
2. ఇందు రసాశ్రయమైన యితివృత్తము, చతుర్విధాభినయ అంగిక వాచికాహార్య సాత్త్విక విశిష్టమైన యవస్థానుకృతియు గలవు. కావున నిది నాట్యోపేతమైనది. ("అవస్థాను కృతిర్నాట్యమ్" "చతుర్థాభినయోపేతం నాట్యముక్తం మనీషిభిః నాట్యం రసాశ్రయమ్)".
3. ఈ యక్షగాన నాట్యము వృత్తనృత్యాను ప్రాణితమైనదని యెరిగిన పెద్దలెల్లరు చెప్పుదురు. (నృత్తంతాళలయాశ్రయమ్, భావాశ్రయం నృత్యమ్)".

ఇట్లు నృత్త నృత్య నాట్యాత్మకమైన యక్షగానముపై నిటీవలి కాలమున మార్గరూపకము ఆధునిక రంగస్థల నాటకముల ప్రభావము పడినను దాని ప్రాక్తనమైన ప్రదర్శన ఫక్కిక యొక్క వ్యక్తితము, నంతకంటే ప్రాక్తనమైన దాని జీవలక్షణము అగు గానకళా ప్రాముఖ్యమును సంరక్షింపబడుచునేవచ్చినవి. నాటక నామ వ్యవహృతమైనను

నీ యిరువదవ శతాబ్దియందును యక్షగాన శబ్దము విస్మృతముగా లేదు. మార్గాధునిక నాటకములు యక్షగానమువలె నృత్య నృత్యగాన ప్రధానములు గావు. నృత్త నృత్య ప్రాధాన్యసాదృశ్యము కారణముగా మన పండితులు కొందరు యక్షగానము పాశ్చాత్య దేశములందలి "ఓపెరా" వంటిదని యభిప్రాయపడి యున్నారు. కాని ఓపెరాలు గాన కేవలములైనవి. యక్షగానములుగాన ప్రధానములే కాని, గాన కేవలములు గావు. అందుగేయ ప్రయోజనమునకేగాక సాధారణ పఠనోద్దిష్టములైన గద్యపద్యము లుండును. అదిగాక యక్షగానములందు బ్రయుక్తమగు నృత్తనృత్యముల తీరువేరు అది కూచిపూడి భాగవతుల వంటి శిష్టుల చేతిలో నిబిడతర శాస్త్ర ప్రక్రియాని కషాయితమైనది; విశిష్ట సంప్రదాయ చోధితమైనదియును.

అసలు యక్షగాన నాట్యము భరతశాస్త్ర సంప్రదాయానుసారము నృత్తనృత్యాలు ప్రాణితమగుటకు , యక్షగానము వీధి నాటకము నేకమగుటకును గూచిపూడి భాగవతులే కారకులై యుందు రేమోయనికూడా ననిపించును. యక్షగానము రూపక ప్రక్రియగా రూపొందిన నాటికాంధ్రదేశమున కూచిపూడి భాగవతులు భరత విద్యా దురంధరులుగా విశేష ప్రసిద్ధి గాంచినారు. దేశాటనము సేయుచు నాటక ప్రదర్శనము లిచ్చుట వారి వృత్తి. వారు రాజసన్మాములు గూడ గాంచినవారు.(ఈ విషయములో పూర్వోక్తము) ఏ సుముహూర్తముననో యక్షగానము వారిదృష్టి నాకర్షించియుండును. తోడనే వారు తమ వీధి నాటక ప్రదర్శనానుభవమును. భరత విద్యా విదగ్ధతనుబట్టి దానినొక విశిష్టరూపక ప్రక్రియగా తీర్చిదిద్దుటకు కృషి చేసియుందురు. ఈ యూహకుపాధి సిద్ధేంద్రయోగి భామా కలాపము సృష్టి. అదికాక యక్షగానములు ప్రదర్శిచుటయందును వారు ప్రసిద్ధులు. వారు ప్రదర్శించువానిలో బ్రసిద్ధములైనవి ప్రహ్లాద, ఉషాపరిణయము, శశిరేఖాపరిణయము, రామనాటకము, హరిశ్చంద్ర, నలచరిత్రము మొ॥. అందుకొన్ని నాటకముల వ్యవహరింపబడినను నవియక్షగాన ప్రాయములైవనే. సాధారణముగా వారి ప్రదర్శనములన్నియు నందు బ్రత్యేకముగా వారి భామా కలాపమును భరత విద్యానవద్య ప్రమాణ పటిష్టములైనను సంగతి ఆంధ్రలోక మంతము నెరింగినదే. వారి భామాకలాప మేకాగ్రముగా నెనిమిది

ప్రదర్శనల కుద్దిష్టమైనదట. కూచిపూడి ప్రదర్శనములన్నిట దీని కెక్కువ ప్రచారము. దీని "బాణీని బట్టి" ఆంధ్రదేశమున వివిధ ప్రదేశములలో నెన్నో భామకలాపములు వెలసినవి. "ఆ బాణీ"తో యక్షగానములుననేకము వెలసినవి. అయితే ఆదిని యక్షగాన రచనా ప్రక్రియమే భామాకలాపమునకు మూదల. అనగా సిద్ధేంద్రునికి (17 శ. మధ్య కాలము) ముందే కూచిపూడివారు యక్షగాన ప్రదర్శనకు పూనుకొని యుందురను నూహకు గొంత యవకాశము గలదు. (అప్పటికే యక్షగాన రచన బాగుగా సాగుచుండినదిగదా) 16 శ. ఆరంభమున కేవారు నాట్యకళా ప్రచారకులుగా ప్రసిద్ధులుకదా, రంగ విషయమునకు, హంగు విషయమునకు గూచిపూడివారి ప్రత్యేకత యంతపోయినను బహువిధాభరణములు, కరాళములు (Masks నృసింహాది పాత్రలకు) గలవారి "సరంజాము" దొడ్డది. వారి ప్రదర్శన ప్రక్రియ సరేసరి. ఆంధ్ర దేశ వివిధ ప్రాంత యక్షగాన ప్రదర్శకులకు వారి ప్రదర్శన పద్ధతులే యాదర్శప్రాయములైనను ఏనాదులు, గొల్లలు మొదలగు తక్కువ తరగతి ప్రదర్శకులు బయలు దేరుటవలన కూచిపూడి కత్తునందలి లగువుబిగువులు వారియెడ నంత కానరావు. కూచిపూడి భాగవతులు నూరూర మేళములుగ బర్యటించుచుండుటవలన నాయా వూళ్ళలోను కొన్ని మేళములు మొలిచినవి. సిద్ధేంద్రయోగి మేళము, భాగవతుల దశరథరామయ్య గారి మేళము 18 శ.న. భాగోతుల బుచ్చిగాని మేళము, 19 శ న రాయలసీమలో లేపాక్షి, వేములపల్లి, తాడిపత్రి మేళములు, 19-20 శ.ల. సంధికాలమున నెల్లూరు మండలమున పడకండ్లస్వామి రాయకవి, త్వరకవి రామకృష్ణయగారల మేళములు, విశాఖ మండలమున నరసింగపల్లి, కళ్లపల్లి కందాళ చిదంబరకవి మేళములు, పల్నాటిసీమ మేళములు మున్నగునవి కొన్ని ప్రసిద్ధికెక్కినవి. కాని యొకనాడాంధ్రుల నాట్యకళా ప్రతిష్ఠలకధిష్ఠానమైన కూచిపూడిలోనే యీనాడా భాగవతులకు గతులు లేకుండా బోయినవనగా నిక గడమ యెడల యక్షగాన ప్రదర్శన మేస్థితిలో నున్నదో తడవంబని లేదు.

17వ శతాబ్ది ప్రథమ పాదముననే తంజావూరులో యక్షగానమునకు రాజాశ్రయము లభించి రంగభోగము విస్తరిల్లినది. రఘునాథ విజయరాఘవ

నాయకుల కాలమున నగరి పెత్తనము క్రింద నాటక శాలలు వెలసిన జాడ దోచుచున్నది. ఆ రాజులు స్వయముగ యక్షగాన రచన గావించిరి. స్థానమున దానికింకను ప్రోత్సాహము కలిగి యిది వీధి నాటక వైఖరితో రంగమున కెక్కినది. విజయరాఘవుని పూతనాహరణము, ప్రహ్లాద చరిత్ర మొ॥ కృతులలో రంగప్రయోగ సూచనలనేకము గలవు. (అవి ముందటి ప్రకరణమున సుదాహృతములు). ప్రహ్లాద చరిత్రమున 'నాటకశాల' 'విదూషక' ప్రశంసలు గలవు. ఇది (ఫలానా) 'పాత్ర వాక్య' మని కలదు. చివర నిందలి పాత్ర వివరములును గలవు. దీనిని బట్టి నాడు యక్షగానము రంగమున కెక్కెననుట విస్పష్టము. కాని యా రంగరచన తీరెట్టిదియో తేటపడలేదు. భారతవిద్యా దురంధరులైన నాయక రాజుల నగరినాటక శాలలందైన రంగరచన భారతశాస్త్రోక్తముగ జరిగియుండునని యూహింప నగును. తదుపరి మహారాష్ట్ర ప్రభువుల కాలమున తంజావూరిలో యక్షగానముపై మార్గనాటక ప్రభావము కూడా బాగుగా బడియుండుటచే (ఈ విషయము బూర్వోక్తము) నాడును యక్షగాన రంగము రాజాస్థానమునందైన శాస్త్రోక్తముగనే తీర్పబడి యుండుననుకొన వచ్చును. కాని యా మహారాష్ట్రుల నాటక గ్రంథములలో సూత్రధారుడు భాగవతులను పాత్రలను బలుకరించినట్లుండుట చూడ నా ప్రదర్శన తీరు కొంత వర కాంధ్రయక్షగానములను బోలినదనియు చెప్పనగును అందు గణపతి సరస్వతుల స్తుతులతో పాటు పాత్రప్రవేశములను చెప్పబడి యుండుట మహారాష్ట్రదేశపు 'లలిత'. నాటక ఫక్కి చివరి మహారాష్ట్ర ప్రభువగు శివాజీ కొలువున భాగవత మేళములుండినట్లు స్పష్టముగా దెలిసినది. (పూర్వోక్తము) అయా యాధారములవలన నాడునాయక మహారాష్ట్ర రాజాస్థానములందు నాటకశాలలు. భాగవతమేళములు విలసిల్లినట్లును భరతవిద్యా ప్రియంభావకులగు నా ప్రభువుల ప్రోత్సాహమున యక్షగాన రంగరచన, ప్రదర్శన భంగి గొంతయైన భరతశాస్త్ర విధాసంవాదిగాఁదీర్పపడి యుండునని నూహింపనగును.

17-18 శతాబ్దులలో తంజావూరులోను, మధుర మైసూరు రాజాస్థానము లందును యక్షగాన ప్రదర్శనలలో స్త్రీలును బాల్గొను చుండినట్లాధారములు

కన్పట్టుచున్నవి. తంజావూరి రఘునాధుడు 'రంగస్థలంబు రామాలంకృతంబు చేసి' నాడు. (చూ. విజయ విలాసము. అవతారిక) విజయరాఘవా స్థానమున యక్ష గానమును గొందరతివలు వినిపించుచుండెడివారని చెంగల్వకాళకవి చెప్పినాడు. (చూ. రాజగోపాలవిలాసము. అవతారిక) వినిపించుట యనగా సంగీత గోష్ఠి యనియేకాక ప్రదర్శించుట యనియు నూహించుట కవకాశం కలదు. విజయ రాఘవాదుల యక్షగాన నాటక ప్రరోచన సర్వ సాధారణముగ 'పరాకు స్వామివారు హవణించిన... నాటకంబు నటన పటిమ గనుపించ వినుపించేము విన నవధరించుచుండ' అని యుండును. అందుచే కాళకవి వక్కణలో నటన పటిమగతార్థమైన దనియే భావింపనగును. అదియుగాక విజయరాఘవ నాయకమైన విజయరాఘవ చంద్రికా విహారమున నాయనివారి "బైటినాటకశాల పడుచు" నాయకయైన దనగా నికనొక నట్టువకత్తె యా వాలకం వేసి దాటకమున బాల్గొనుట కభ్యంతరముండునా నాయనివారి కొలువులో! మైసూరు కంఠీరవ మహారాజు కొలువునను దదుపజ్ఞములగు యక్షగాన ప్రాయ రచనలు పదకేళికలవలె నట్టువరాండ్రచే బ్రవర్తింపబడి యుండునను నూహకుగల సామంజస్యమిదివరకే పరిశీలింపబడినది. మధుర విజయరంగ చొక్కనాథ "సభార్హముగా" వెలసిన తిరుమల కవి తిల్లగోవిందరాజు నాటకమును "ఉదుటువగ కోపులవైపులమర... ఇంచుబోణులు నటించు" వారని యందేకలదు. ఆ యాధారములను బట్టినాడు దక్షిణదేశ రాజాస్థానములందు యక్షగాన ప్రదర్శనలలో స్త్రీలును బాల్గొనుచుండిరని చెప్పవచ్చును. ఇది 17-18 శతాబ్దులముచ్చట. కాని 19శ. పూ.భా. తంజావూరు శివాజీ నగరి భాగవత మేళము "సబనీసు" దగ్గర నుండిన శివాజీ అన్నపూర్ణా పరిణయ నాటకము "వేషాలనావనీసు"ను (తం. స. మ. నం. 622) గాని తం. స. మ. కే. నం. 799 "నాటక పాత్రలు" అను పట్టికలనుగాని పరిశీలించినచో నొక్కయపవాదమైన లేకుండా నన్ని స్త్రీ పాత్రల నెదుటను పురుషనామములే కన్పట్టును. అనగా నానాడు పురుషులే స్త్రీ పాత్రలను ధరించుచుండిరనుట స్పష్టము. దీనికి కారణము 18శ. చివర తంజావూరికి మిక్కిలి సమీపముననున్న మెలట్టూరున వెలసిన భాగవత మేళ

నాటకముల సంప్రదాయము కావచ్చును. అవి నాటి తంజావూరు రాజస్థాన నాటకములవలె యక్షగాన ప్రాయములైనవేయయ్యు కూచిపూడి వారి ప్రదర్శనల వలె నొకగొప్ప విశిష్ట సంప్రదాయ పటిష్ఠమైన ప్రక్రియగలట్టివి. (ప్రత్యేకముగా వీని గురించి వివరములకు చూ.నా ఆంధ్ర యక్షగాన వాఙ్మయ చరిత్ర పుట. 190–95).

ఉపసంహారము

సర్వోపభోగ్య సమాహార కళాస్వరూపమై, వివిధ ప్రక్రియాను బంధ బంధురమై, బహువిధ పదకవితల పాలవెల్లియై, అతి మాత్ర వస్తు రసచ్ఛందో భాషావైవిధ్యభాసురమై, భిన్నదేశ భిన్నకాల కమ్యోపజ్ఞమై అనేక లోకవృత్త విశేష ప్రదర్శకమై ఆంధ్ర జాతీయ రూపక కళాసరస్వతి ప్రతినిధియై అన్యభాషీయులకు అనుకార్యమై యావదాంధ్ర వాఙ్మయమున బహుముఖ వై విధ్యము, వైశిష్ట్యము కలిగి విశాల సారస్వత శాఖగా విలసిల్లిన ప్రక్రియ యక్షగాన మొక్కటే.

గమనిక :- ఇంకను వివరములకు, విశేషములకు, ఆధారములకు, ఆకరములకు నా “ఆంధ్ర యక్షగాన వాఙ్మయ చరిత్ర” అను గ్రంథము చూడదగును.

ప్రచురణ : ఆంధ్ర విశ్వకళాపరిషత్తు, వాల్తేరు.

Blank Page

ప్రపంచ తెలుగు మహాసభల ఆశయాలు

- తెలుగు జాతి భాషా సంస్కృతులపై నేటి యువతరానికి ఆసక్తి కలిగించేలా ప్రణాళికలు తయారు చేయడం.
- ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగు వారిని ఒక వేదికపై చేర్చి భాషాసంస్కృతులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారాలు కనుగొనడం.
- తెలుగుభాష ప్రపంచ భాషలతో సరితూగేలా అంతర్జాలంలో ఉపయోగించ డానికి చర్యలు చేపట్టడం.

  తెలుగును పాలన, బోధన, ప్రసార మధ్యమ భాషగా వినియోగించేందుకు చర్యలు తీసుకోవడం.
- తెలుగు వారి జానపద, సంప్రదాయ కళారూపాల ప్రదర్శనలకు, ప్రచారానికి ప్రణాళిక రూపొందించడం.
- తెలుగు జాతి ప్రాచీనతలను, ప్రశస్తిని వెలుగులోకి తేవడం
- తెలుగు జాతి చరిత్రపై భాషపై గ్రంథాలు ప్రచురించి కొత్త పారిభాషిక పదాలు తయారు చేయడం.
- తెలుగు భాషను అభ్యసించే వారికి సరళమైన శైలిలో పాఠ్యగ్రంథాలు, బోధనోపకరణాలు తయారు చేసే ప్రణాళిక రూపొందించడం.
- తెలుగు నేలపై గల చారిత్రిక, ఆధ్యాత్మిక స్థలాలకు, పర్యాటక కేంద్రాలకు ప్రాచుర్యం కల్పించడం.

తెలుగు భాష వికాసం **తెలుగు సంస్కృతి ప్రకాశం**

దేశ భాషలందు తెలుగు లెస్స